B9 NEWS
నిజం - మా ఇజం

మన.. ప్రజా పక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం...



PUBLISHED FROM: Telangana & Andhrapradesh | సంపుటి : 01 | సంచిక : 264 | ఆదివారం | 18-10-2026 | ఎడిటర్ : పులిజ్వాల చంద్రకాంత్ | పేజీలు : 08 | వెల : 05/-



తెలంగాణలో తీవ్ర కరవు

2

315 మండలాల్లో కరవు ఛాయలు:తుమ్మల నాగేశ్వరరావు

- రాష్ట్రంలో 315 మండలాల్లో కరవు పరిస్థితులు నెలకొన్నట్టు గుర్తింపు
- కేంద్రం తక్షణమే సాయం చేయాలని కోరిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- రాష్ట్రవ్యాప్తంగా 23 శాతం వర్షపాత లోటు, 13 లక్షల ఎకరాల్లో తగ్గిన సాగు
- పంట నష్టపోయిన రైతులకు రూ.1,986 కోట్ల సహాయ ప్యాకేజీ ప్రతిపాదన
- ప్రమాదకరంగా పడిపోయిన జలాశయాల నీటిమట్టాలు

మన ప్రజాపక్షం,హైదరాబాద్

తెలంగాణలో కరవు పరిస్థితులు తీవ్ర రూపం దాల్చాయి. ఎల్ నినో ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా వర్షపాతం గణనీయంగా తగ్గడంతో 315 మండలాల్లో కరవు ఛాయలు అలుముకున్నాయని రాష్ట్ర ప్రభుత్వం ప్రాథమికంగా నిర్ధారించింది. ఈ నేపథ్యంలో రాష్ట్రాన్ని తక్షణమే ఆదుకోవాలని, సూక్ష్మ సేద్యం (మైక్రో ఇరిగేషన్), మధ్యంతర పంట విత్తనాల పంపిణీకి అవసరమైన ఆర్థిక సాయం అందించాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కేంద్ర ప్రభుత్వాన్ని

చిన్నారుల అశ్లీల కంటెంట్ పై నిషేధం

2



ప్లాట్ ఫారమ్స్ పై చర్యలు తీసుకోవాలని సుప్రీంకోర్టు ఆదేశం

పిల్లలకు హాని కలిగించే లైంగిక దోపిడీ కంటెంట్‌ను సబ్‌స్క్రిప్షన్ లేదా పేవాల్ ద్వారా అందించకూడదని సుప్రీం కోర్టు ఆదేశించింది. నిబంధనలు ఉల్లంఘించే వారి కోసం భారీగా జరిమానాలు విధించే వ్యవస్థను పరిశీలించాలని కేంద్రానికి సూచించింది.

మన ప్రజాపక్షం,ఢిల్లీ

పిల్లలకు హాని కలిగించే లైంగిక దోపిడీ కంటెంట్‌ను ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచే సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లపై సుప్రీం కోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇలాంటి కంటెంట్‌ను పేవాల్ లేదా సబ్‌స్క్రిప్షన్ ద్వారా ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా అందించడం, అప్లోడ్ చేయడం, ప్రచారం చేయడం, ప్రసారం చేయడం జరగకుండా ప్రతి మధ్యవర్తిత్వ సంస్థ (ఇంటర్మీడియరీస్) చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. జస్టిస్ జేబీ పార్దివాలా, జస్టిస్ కె. వినోద్ చంద్రన్‌లతో కూడిన ధర్మాసనం అక్టోబర్ 15న ఈ ఆదేశాలు జారీ చేసింది. పిల్లల లైంగిక దోపిడీ, వేధింపులకు సంబంధించిన కంటెంట్‌ను చైల్డ్ సెక్సువల్ ఎక్స్‌ప్లాయిటేషన్ అండ్ అబ్యూస్ మెటీరియల్‌గా పేర్కొంటూ, దానిని అరికట్టడంలో ప్లాట్‌ఫామ్‌లు, నియంత్రణ సంస్థలు తగిన చర్యలు తీసుకోవట్లేదని వ్యాఖ్యానించింది. 2024లోనే సుప్రీం కోర్టు ఈ అంశంపై ఆదేశాలు ఇచ్చినప్పటికీ, సోషల్ మీడియా సంస్థలు వాటిని సరిగా అమలు చేయడం లేదని ధర్మాసనం చీవాట్లు పెట్టింది. రెండేళ్లు దాటినా చెప్పుకోదగ్గ పురోగతి ఏం కనిపించడం లేదని, ఇటీవలి కాలంలో వచ్చిన వార్తలు పిల్లల భద్రతపై మరింత ఆందోళన కలిగిస్తున్నాయని తెలిపింది. ప్రత్యేకించి ఈ హానికర కంటెంట్‌కు నేరుగా లింక్స్ ఇవ్వకపోయినా, సోషల్ మీడియా అల్గారిథంల ద్వారా పరోక్షంగా వాటిని ప్రచారం చేసి చట్టం నియంత్రణ తప్పించుకునే ప్రయత్నాలు జరుగుతున్నాయని కోర్టు గుర్తుచేసింది. పిల్లల్ని రక్షించేందుకు రూపొందించిన పోక్సో



కరెంట్,నీళ్లు పొదుపుగా వాడాలి

2

ఎల్ నినో ఎఫెక్ట్:కరెంట్,నీళ్లు పొదుపుగా వాడాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క విజ్ఞప్తి

ఎల్ నినో ప్రభావంపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆందోళన

విద్యుత్, నీటిని పొదుపుగా వినియోగించాలని ప్రజలకు విజ్ఞప్తి

రాష్ట్రంలో 20,000 మెగావాట్లకు చేరిన విద్యుత్ డిమాండ్

గతంలో చలిగా ఉండే అక్టోబర్‌లోనూ ఇప్పుడు ఎండల తీవ్రత

వాతావరణ మార్పుల వల్లే ఈ పరిస్థితి నెలకొందన్న భట్టి

మన ప్రజాపక్షం,హైదరాబాద్

రాష్ట్రంలో ఎల్ నినో ప్రభావంతో వాతావరణ పరిస్థితులు ప్రతికూలంగా మారిన నేపథ్యంలో, ప్రజలు విద్యుత్తు, నీటిని అత్యంత పొదుపుగా వినియోగించుకోవాలని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క విజ్ఞప్తి చేశారు. మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా సహజ వనరులను బాధ్యతాయుతంగా వినియోగించుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని ఆయన స్పష్టం చేశారు. శనివారం హైదరాబాద్‌లో నిర్వహించిన 'బతుకమ్మ యంగ్ ఫిల్మ్ మేకర్స్

అభిజీత్ దీపక్కు బెయిల్

2

పీస్ బాండ్‌పై సంతకం చేసిన తర్వాతే విడుదల!

తలైనా ఇస్తా..కానీ నీళ్ల కోసం యుద్ధమే

గురువు కోమటిరెడ్డి కోసం తలైనా ఇస్తా..కానీ నీళ్ల కోసం యుద్ధమే : ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి



2

- ఏదుల నుంచి డిండికి నీటిని తరలించడాన్ని అంగీకరించేది లేదన్న అనిరుధ్ రెడ్డి
- పాలమూరు నీళ్ల కోసం గురువునైనా ఎదిరిస్తానని వ్యాఖ్య
- తనకు పాలమూరు ప్రయోజనాలే ముఖ్యమన్న అనిరుధ్

నచ్చని ఓట్లను తొలగిస్తున్నారు..

2



- బీజేపీకి నచ్చని ఓట్లను తొలగిస్తున్నారు..
- 'సర్' ప్రక్రియపై మహేశ్ కుమార్ గౌడ్
- 'సర్' ప్రక్రియలో లోపాలున్నాయన్న టీపీసీసీ చీఫ్
- ఓటర్ల జాబితా సవరణలో నిబంధనలు పాటించడం లేదని విమర్శలు
- వ్యక్తి మరణిస్తే ఓటు తొలగించాలని, వేరే ప్రాంతానికి మారితే బదిలీ చేయాలని సూచన
- ఎన్నికల సంఘం స్వతంత్రతపై ఆందోళన

చంద్రబాబు ప్లాన్‌కు రేవంత్ సహకారం

తెలంగాణ నీళ్లను తరలించే కుట్ర : హరీశ్‌రావు

తెలంగాణలో కరవు పరిస్థితులకు ప్రభుత్వమే కారణమని ఆరోపణ

దేవాదులలో 10 మోటార్లకు మూడు మాత్రమే నడుస్తున్నాయని విమర్శ

గోదావరి జలాల తరలింపునకు చంద్రబాబు ప్రయత్నిస్తున్నారని ఆరోపణ

గోదావరి-కావేరి అనుసంధాన ప్రతిపాదనపై హరీశ్‌రావు అభ్యంతరం

తెలంగాణ నీటి ప్రయోజనాల విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా ఉందని విమర్శ

మన ప్రజాపక్షం,హైదరాబాద్

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు తీవ్ర విమర్శలు చేశారు. రాష్ట్ర ప్రయోజనాలను దెబ్బతీస్తూ తెలంగాణ సమాజానికి తీరని ద్రోహం చేస్తున్నారని



2

సినిమా పాటలకు డ్యాన్స్ చేస్తే.. కఠిన చర్యలు

మద్రాస్ హైకోర్టు సంచలన ఆదేశాలు

నవరాత్రి వేడుకల్లో సినిమా పాటలకు నృత్యాలు చేయడంపై మద్రాస్ హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. పోలీసుల అనుమతి నిబంధనలు ఉల్లంఘిస్తే తక్షణ చర్యలు తీసుకోవాలని హైకోర్టు ఆదేశించింది.

మన ప్రజాపక్షం,మద్రాస్

నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ప్రజలు సినిమా పాటలకు డ్యాన్సులు చేస్తే తక్షణ చర్యలు తీసుకోవాలని మద్రాస్ హైకోర్టు ఆదేశించింది. ఈ మేరకు తమిళనాడు పోలీసులకు ఆదేశాలు జారీ చేసింది. నవరాత్రి ఉత్సవాల సందర్భంగా సినిమా పాటలకు నృత్యాలు చేయడంపై మద్రాస్ హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. ఈ వ్యవహారంపై విచారణ చేపట్టిన న్యాయస్థానం,



2



తెలంగాణకు నేటి నుంచి వర్ష సూచన..


పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ

- ఉరుములు, మెరుపులతో పాటు ఈదురుగాలుల హెచ్చరిక
- ఉత్తర తమిళనాడు తీరంపై కొనసాగుతున్న ఉపరితల ఆవర్తనం
- హైదరాబాద్ సహా అనేక జిల్లాలకు ఎల్లో వార్నింగ్ జారీ

2

బలూచిస్థాన్‌లో ఉద్రిక్తత

20 మంది పోలీసుల కిడ్నాప్



- బలూచిస్థాన్‌లో 20 మంది పోలీస్ రిక్రూట్‌లను అపహరించిన సాయుధులు
- ఇది బలోచ్ వేర్పాటువాదుల పనేనని అనుమానం
- రాష్ట్రంలో బలవంతపు అదృశ్యాలు, కస్టడీ మరణాలపై తీవ్ర ఆరోపణలు
- పాక్ భద్రతా బలగాల ఆధీనంలో పలువురు టీచర్ల మృతి చెందినట్లు ఆరోపణలు
- మస్తుంగ్ జిల్లాలో గాలింపు చర్యలు ముమ్మరం చేసిన పాక్ సైన్యం

2

మన ప్రజాపక్షం,బలూచిస్థాన్

పాకిస్థాన్‌లోని బలూచిస్థాన్ ప్రావిన్స్‌లో మరోసారి తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. బలోచ్ వేర్పాటువాదులుగా అనుమానిస్తున్న కొందరు సాయుధులు, శిక్షణలో ఉన్న 20 మంది పోలీసు సిబ్బందిని అపహరించారు. శుక్రవారం సాయంత్రం మస్తుంగ్ జిల్లాలోని గోర్గినా ప్రాంతంలో ఈ ఘటన చోటుచేసుకుంది. కలాత్ రిక్రూట్ ట్రైనింగ్ సెంటర్ నుంచి సెలవుపై తమ స్వగ్రామాలకు వెళుతున్న

All are Continues Second Page

కరెంట్,నీళ్లు పొదుపుగా వాడాలి

మొదటి పేజీ తరువాయి

అవార్డ్స్' ప్రదానోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు పురస్కారాలను అందజేశారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ, రాష్ట్రంలో నెలకొన్న ప్రస్తుత పరిస్థితులపై ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ సుమారు 20,000 మెగావాట్లకు చేరుకుందని, పెరుగుతున్న ఉష్ణోగ్రతల ప్రభావంతో విద్యుత్ వినియోగం భారీగా పెరిగిందని వివరించారు.గతంలో అక్టోబర్, నవంబర్ నెలల్లో చలి తీవ్రత అధికంగా ఉండేదని, అయితే ప్రస్తుతం వాతావరణ మార్పుల వల్ల పరిస్థితులు పూర్తిగా భిన్నంగా మారాయని ఆయన పేర్కొన్నారు. "ఒకప్పుడు చలి నుంచి రక్షణ పొందేందుకు ప్రయత్నించేవాళ్లం, కానీ నేడు ఎండల తీవ్రత నుంచి మనల్ని మనం కాపాడుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది" అని వ్యాఖ్యానించారు. వాతావరణంలో సంభవిస్తున్న ఈ అనూహ్య మార్పులే విద్యుత్, నీటి కొరతకు దారితీస్తున్నాయని అభిప్రాయపడ్డారు. ప్రతి ఒక్కరూ సహజ వనరుల విలువను గుర్తించి, వాటిని పొదుపుగా వినియోగించాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

బలూచిస్థాన్‌లో ఉద్రిక్తత

మొదటి పేజీ తరువాయి

పోలీస్ రిక్రూట్‌లు ప్రయాణిస్తున్న వ్యాన్‌ను సాయుధులు అడ్డగించి, వారిని కిడ్నాప్ చేశారు.ఈ ఘటనతో అప్రమత్తమైన పాకిస్థాన్ భద్రతా బలగాలు, అపహరణకు గురైన పోలీసుల ఆచూకీ కోసం భారీ గాలింపు చర్యలు చేపట్టాయి. మస్తుంగ్ జిల్లా వ్యాప్తంగా చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి భద్రతను కట్టుదిట్టం చేశాయి. ఇదే క్రమంలో, టర్బత్ సమీపంలో కొన్ని సరుకు రవాణా ట్రక్కులకు కూడా బలోచ్ వేర్పాటువాదులు నిప్పుపెట్టినట్లు సమాచారం. ఈ ఘటనలపై దర్యాప్తు కొనసాగుతోంది.

తెరపైకి కస్టడీ మరణాల ఆరోపణలు

ఈ దాడుల నేపథ్యంలో, బలూచిస్థాన్‌లో సుదీర్ఘ కాలంగా పాక్ భద్రతా దళాలపై వస్తున్న బలవంతపు అదృశ్యాలు, కస్టడీ మరణాల ఆరోపణలు మరోసారి చర్చనీయాంశమయ్యాయి. ఇటీవలే, పర్వేజ్ అనే పాఠశాల ఉపాధ్యాయుడి మృతదేహం పాస్నిలో లభ్యమైంది. అంతకు ఒకరోజు ముందు, కుటుంబ సభ్యుల సమక్షంలోనే పాక్ భద్రతా దళాలు అతన్ని అదుపులోకి తీసుకున్నాయని 'ది బలూచిస్థాన్ పోస్ట్' కథనం ప్రచురించింది. పర్వేజ్ అరెస్టు, మరణంపై పాక్ అధికారులు ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు.ఈ ఏడాది ఇలాంటి ఘటనలు పెరిగాయని మానవ హక్కుల సంఘాలు ఆరోపిస్తున్నాయి. ఆగస్టులో, పంజ్‌గూర్‌కు చెందిన హాతిమ్ బలోచ్ అనే మరో ఉపాధ్యాయుడిని గుర్తుతెలియని వ్యక్తులు అపహరించగా, కొన్ని వారాల తర్వాత ఆయన మృతదేహం లభ్యమైంది. అదేవిధంగా, గత ఏడాది అక్టోబర్‌లో పాక్ బలగాలు అదుపులోకి తీసుకున్న అయాజ్ బలోచ్ అనే ఉపాధ్యాయుడి మృతదేహం ఈ ఏడాది జనవరిలో లభించింది.

నివేదికలో సంచలన విషయాలు

'బలోచ్ యక్‌జెహతీ కమిటీ (బీవైసీ)' విడుదల చేసిన నివేదిక ప్రకారం, 2026 జనవరి నుంచి జూన్ వరకు బలూచిస్థాన్‌లో 507 బలవంతపు అదృశ్యాలు నమోదయ్యాయి. వీరిలో 135 మంది విద్యార్థులు, ఉపాధ్యాయులు, పరిశోధకులు ఉండటం గమనార్హం. వీరిలో 32 మంది కస్టడీలోనే మరణించారని ఆ సంస్థ ఆరోపించింది.తాజాగా కిడ్నాప్ ఘటన జరిగిన మస్తుంగ్ జిల్లాలోనే అక్టోబర్ 9న ఓ ఇంటిపై డ్రోన్ దాడి జరగగా ఇద్దరు పౌరులు గాయపడ్డారు. జనవాసాలపై పాక్ సైన్యం డ్రోన్లు, ఫైటర్ జెట్లతో దాడులు చేస్తూ పౌరుల ప్రాణాలకు ముప్పు కలిగిస్తోందని బీవైసీ ఆరోపించింది. ఒకవైపు వేర్పాటువాదుల దాడులు, మరోవైపు భద్రతా దళాలపై వస్తున్న తీవ్ర ఆరోపణలతో బలూచిస్థాన్‌లో సామాన్య పౌరుల భద్రత ప్రశ్నార్థకంగా మారింది.

చిన్నారుల అశ్లీల కంటెంట్‌పై నిషేధం

మొదటి పేజీ తరువాయి

చట్టంలోని సెక్షన్లు 15, IT చట్టంలోని సెక్షన్ 67దీ వంటి నిబంధనల అమలును తప్పించుకునే విధంగా ఇలాంటి కంటెంట్‌ను ప్రోత్సహించకూడదని స్పష్టం చేసింది.

ఉల్లంఘిస్తే భారీ జరిమానా, అక్రమ ఆదాయం స్వాధీనం

ఇక సోషల్ మీడియా మధ్యవర్తులు సమాచార సాంకేతిక చట్టం నిబంధనల్ని ఉల్లంఘిస్తే భారీగా జరిమానాలు విధించే వ్యవస్థను రూపొందించే అంశాల్ని పరిశీలించాలని కేంద్ర ప్రభుత్వానికి అత్యున్నత న్యాయస్థానం సూచించింది. పెనాల్టీ మొత్తాన్ని నిర్ణయించేటప్పుడు ఉల్లంఘన తీవ్రత, ఎంత కాలం కొనసాగింది, ఎన్ని సార్లు రిపీట్ అయింది, వార్షిక టర్నోవర్ వంటి అంశాల్ని పరిగణనలోకి తీసుకోవాలని స్పష్టం చేసింది. పేవాల్ లేదా ఇతర సబ్‌స్క్రిప్షన్ల ద్వారా నిషేధిత కంటెంట్‌ను నేరుగా లేదా పరోక్షంగా హోస్ట్ చేయడం, అప్లోడ్ చేయడం, ప్రచారం, ప్రసారం చేస్తే, ఆ కంటెంట్ ద్వారా సంబంధిత ప్లాట్‌ఫామ్ సంపాదించిన ఆదాయాన్ని తిరిగి స్వాధీనం చేసుకునే విధానం ఉండాలని కూడా ఆదేశించింది.అక్రమ/నకిలీ కంటెంట్‌ను వేగంగా గుర్తించి తొలగించడానికి సాంకేతిక వ్యవస్థల్ని వినియోగించాలని ధర్మాసనం ఈ సందర్భంగా సూచించింది. అన్ని ప్రముఖ సోషల్ మీడియా మధ్యవర్తిత్వ సంస్థలు తమ ప్లాట్‌ఫామ్‌ల నుంచి చిన్నారుల లైంగిక దోపిడీ కంటెంట్‌ను గురించి, తొలగించేందుకు వీలుగా పర్‌సెప్చువల్ హాష్ మ్యాచింగ్, యూఆర్ఎల్ లిస్టింగ్ వంటి సాంకేతికతల్ని ఉపయోగించేలా తగిన మార్గదర్శకాలు రూపొందించాలని కేంద్ర ప్రభుత్వాన్ని సుప్రీం కోర్టు ఆదేశించింది. ఈ చైల్డ్ సెక్సువల్ ఎక్స్‌ప్లాయిటేషన్ అండ్ అబ్యూస్ మెటీరియల్ ను గుర్తించి తొలగించడమే ఏకైక లక్ష్యంగా నేషనల్ హ్యాష్ అండ్ యూఆర్ఎల్ లిస్ట్ డేటాబేస్‌ను ఏర్పాటు చేయాలని కేంద్రాన్ని ఆదేశించింది.

తెలంగాణకు నేటి నుంచి వర్ష సూచన..

మొదటి పేజీ తరువాయి

తెలంగాణలో రానున్న రోజుల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది. రేపు, ఎల్లుండి రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడతాయని, కొన్నిచోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన జల్లులు కురిసే అవకాశముందని తెలిపింది. ఈ మేరకు హైదరాబాద్ వాతావరణ కేంద్రం పలు జిల్లాలకు ఎల్లో వార్నింగ్ జారీ చేసింది.ఉత్తర తమిళనాడు, దానిని ఆనుకుని ఉన్న దక్షిణ కోస్తాంధ్ర ప్రాంతాల్లో సముద్ర మట్టానికి 4.5 నుంచి 5.8 కిలోమీటర్ల ఎత్తులో ఉపరితల ఆవర్తనం కొనసాగుతోంది. దీని ప్రభావంతో తెలంగాణలో రానున్న మూడు రోజుల పాటు వర్షాలు కురుస్తాయని అధికారులు అంచనా వేస్తున్నారు. వర్షంతో పాటు గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు కూడా వీచే అవకాశం ఉందని హెచ్చరించారు.రేపు (అక్టోబర్ 18) హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, మహబూబ్‌నగర్, నల్గొండ, సూర్యాపేట, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం సహా పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేశారు. వర్షాల నేపథ్యంలో, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ అధికారులు సూచించారు.

తలైనా ఇస్తా..కానీ నీళ్ల కోసం యుద్ధమే

మొదటి పేజీ తరువాయి

జడ్చర్ల కాంగ్రెస్ ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. తన రాజకీయ గురువైన మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి కోసం తన తలనైనా నరుక్కుంటానని... కానీ పాలమూరు ప్రాంత నీటి హక్కుల విషయంలో మాత్రం రాజీ పడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. నీళ్ల కోసం అవసరమైతే గురువుతోనైనా యుద్ధం చేస్తానని, తన ప్రాంత ప్రయోజనాలే తనకు ముఖ్యమని తేల్చిచెప్పారు.జడ్చర్లలోని తన క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు.పాలమూరు-రంగారెడ్డి, డిండి ఎత్తిపోతల పథకాల మధ్య నీటి కేటాయింపుల వివాదంపై ఆయన తన వైఖరిని స్పష్టం చేశారు. ఏదుల రిజర్వాయర్ నుంచి డిండి ప్రాజెక్టుకు నీటిని తరలించే ప్రతిపాదనను ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించబోమని అన్నారు. ముందుగా పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు ద్వారా పాలమూరుకు నీరందించాకే, దిండికి నీటిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు.గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు పనులు కేవలం 60 శాతమే పూర్తయ్యాయని అనిరుధ్ రెడ్డి ఆరోపించారు.ఈ ప్రాజెక్టు పూర్తి కోసం జేఏసీ తలపెట్టిన జలదీక్షకు తన సంపూర్ణ మద్దతు ఉంటుందని ప్రకటించారు. ప్రాజెక్టు సాధన కోసం పాలమూరు ఎమ్మెల్యేలంతా ఐక్యంగా పోరాడతామని చెప్పారు. అదే సమయంలో, ప్రతి అంశానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని అనవసరంగా లక్ష్యంగా చేసుకోవద్దని ఆయన హితవు పలికారు.

అభిజీత్ దీప్కేకు బెయిల్

మొదటి పేజీ తరువాయి

అభిజీత్ దీప్కే శుక్రవారం తిరంగా మార్చ్ కోసం కనాట్‌ప్లేస్‌కు బయలుదేరగా, పోలీసులు ఆయనను అడ్డుకొని అదుపులోకి తీసుకున్నారు. దీనిపై సీజేపీ లీగల్ అఫైర్స్ హెడ్ రత్నా సింగ్ న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. పోలీసులు దీప్కే ప్రాథమిక హక్కులను, చట్ట ప్రక్రియను ఉల్లంఘించారని ఆరోపించారు. దీప్కేను తక్షణమే విడుదల చేయాలని స్పెషల్ ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ కోర్టును ఆమె కోరారు. ఆ తర్వాత, శాంతియుతంగా నిరసనలో పాల్గొనాలని పౌరులను కోరడం నేరం ఎలా అవుతుంది? అని రత్నా సింగ్ ఎక్స్ వేదికగా ప్రశ్నించారు. "అభిజీత్ దీప్కే అరెస్టు చట్టవిరుద్ధం. కాబట్టి స్పెషల్ ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ కోర్టు (ఎస్ఈఎం) ఆయనను విడుదల చేయాలి. ఆయన ప్రజలను కేవలం త్రివర్ణ పతాకాన్ని ఎగురవేయాలని మాత్రమే కోరారు. అది నేరం ఎలా అవుతుంది?" అని రత్నా సింగ్ ప్రశ్నించారు.అభిజీత్ దీప్కేను ఆయన నివాసం వెలుపల నుంచి తీసుకెళ్లిన తీరుపై రత్నా సింగ్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. "అభిజీత్ దీప్కేను ఆయన నివాసం వెలుపలి నుంచి తీసుకెళ్లిన విధానం దారుణంగా ఉంది. అధికారులు కనీసం ఆయన ఎక్కడ ఉన్నారనే సమాచారాన్ని వెల్లడించలేదు. అలాగే దీప్కే తన న్యాయవాదిని కలుసుకునే అవకాశం కూడా ఇవ్వలేదు. ఇది చట్టప్రక్రియ, ప్రాథమిక హక్కులపై తీవ్ర ఆందోళనలను రేకెత్తిస్తోంది. రాజ్యాంగబద్ధమైన ప్రజాస్వామ్యంలో ఇలాంటి అధికార దుర్వినియోగాన్ని ఎలా సమర్థించుకుంటారు? 'ప్రివెంటివ్ డిటెన్షన్' పేరుతో దిల్లీ పోలీసులు ఇలా చట్టవిరుద్ధమైన పనులకు పాల్పడకూడదు" అని రత్నా సింగ్ అన్నారు. అభిజీత్ దీప్కేను శనివారం మధ్యాహ్నం మందిర్‌మార్గ్ పోలీస్ స్టేషన్‌లోని ఎస్ఈఎం ముందు హాజరుపరచాల్సి ఉందని ఆమె తెలిపారు.

ఇంతకీ ఏం జరిగింది?

కన్నాట్ ప్లేస్‌లోని సెంట్రల్ పార్క్‌లో నిర్వహించాలనుకున్న 'లెట్రో దో తిరంగా' ర్యాలీకి వెళ్తున్న దీప్కేను దిల్లీ పోలీసులు శుక్రవారం అదుపులోకి తీసుకున్నారు. అంతేకాదు సెంట్రల్ దిల్లీలో బహిరంగ సభలపై కఠినమైన నిషేధాజ్ఞలు విధిస్తూ అధికారులు భారతీయ నాగరిక్ సురక్ష సంహిత (బీఎన్ఎస్ఎస్)లోని సెక్షన్ 163ని ప్రయోగించారు.ఎస్ఐఆర్ ప్రక్రియలో అక్రమాలు జరిగాయంటూ ఎన్నికల సంఘానికి వ్యతిరేకంగా సీజేపీ తలపెట్టిన నిరసనల నేపథ్యంలో దీప్కేను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. తాము బహిరంగ హెచ్చరికలు జారీ చేసినప్పటికీ, నిషేధాజ్ఞలు ఉల్లంఘించిన దాదాపు 150 మంది నిరసనకారులను అదుపులోకి తీసుకున్నామని, వారిపై ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశామని పోలీసులు తెలిపారు. ముఖ్యంగా దీప్కేపై బీఎన్ఎస్ఎస్‌లోని సెక్షన్ 126, సెక్షన్ 170 కింద కేసు నమోదు చేశామన్నారు.

నచ్చని ఓట్లను తొలగిస్తున్నారు..

మొదటి పేజీ తరువాయి

ఎన్నికల సంఘం చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో తీవ్ర లోపాలున్నాయని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ ఆరోపించారు. ఈ ప్రక్రియలో పారదర్శకత లేదని, తనకు కూడా నోటీసు వచ్చిందని వెల్లడించారు. గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడిన ఆయన.. ఓటర్ల జాబితా సవరణలో నిబంధనలను సరిగా పాటించడం లేదని విమర్శించారు.ఓ వ్యక్తి మరణిస్తే వారి ఓటును తొలగించాలని, వేరే ప్రాంతానికి మారితే ఓటును బదిలీ చేయాలని మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. అయితే, కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీకి నచ్చని ఓట్లను ఏకపక్షంగా తొలగించే కుట్ర జరుగుతోందని ఆరోపించారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో పారదర్శకత పాటించాలని డిమాండ్ చేశారు.ఇప్పటికే ఈడీ, సీబీఐ వంటి కేంద్ర దర్యాప్తు సంస్థలను రాజకీయ ప్రత్యర్థులపై ప్రయోగిస్తున్న బీజేపీ.. ఇప్పుడు ఎన్నికల సంఘాన్ని కూడా తన రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించుకుంటోందని మహేశ్ కుమార్ గౌడ్ ఆరోపించారు. ఎన్నికల సంఘం స్వతంత్రతపై ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ నియామక ప్రక్రియలో చేసిన మార్పులపైనా మహేశ్ గౌడ్ ప్రశ్నలు లేవనెత్తారు. సీఈసీ ఎంపిక కమిటీ నుంచి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిని ఎందుకు తొలగించారని కేంద్రాన్ని ప్రశ్నించారు. స్వతంత్ర సంస్థల విధుల్లో కేంద్రం జోక్యం చేసుకోవడం ప్రజాస్వామ్యానికి ముప్పుగా మారుతుందని హెచ్చరించారు.

చంద్రబాబు ప్లాన్‌కు రేవంత్ సహకారం

మొదటి పేజీ తరువాయి

ఆరోపించారు. రాష్ట్రంలోని సాగునీటి ప్రాజెక్టుల్లో నీళ్లు లేకుండా చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని, ఎల్‌నినో పేరుతో ప్రభుత్వం చేతులెత్తేస్తోందని మండిపడ్డారు. అత్యంత కీలకమైన సాగునీటి విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం ఏంటని ప్రశ్నించారు. తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడిన ఆయన.. రాష్ట్రంలో నెలకొన్న కరవు పరిస్థితులకు రేవంత్‌రెడ్డి ప్రభుత్వమే కారణమని ఆరోపించారు.దేవాదుల ప్రాజెక్టులో 10 మోటార్లు అందుబాటులో ఉన్నప్పటికీ మూడు మాత్రమే నడిపిస్తున్నారని హరీశ్‌రావు విమర్శించారు. తాము అభ్యంతరాలు వ్యక్తం చేసిన తర్వాతే ప్రభుత్వం స్పందించిందని అన్నారు. తెలంగాణతో పోలిస్తే ఆంధ్రప్రదేశ్‌లో తక్కువ వర్షపాతం నమోదైనా అక్కడ కరవు పరిస్థితులు, పంటల సాగుకు విరామం ప్రకటించే పరిస్థితి లేదని పేర్కొన్నారు. తెలంగాణలో మాత్రం రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని విమర్శించారు.గోదావరి జలాలను ఇతర ప్రాంతాలకు తరలించేందుకు ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రయత్నిస్తున్నారని హరీశ్‌రావు ఆరోపించారు. గోదావరి-కావేరి అనుసంధానం పేరుతో తెలంగాణ నీటిని తరలించే ప్రతిపాదనలకు రేవంత్‌రెడ్డి సహకరిస్తున్నారని విమర్శించారు. గతంలో గోదావరి-బనకచర్ల, గోదావరి-నల్లమలసాగర్ ప్రతిపాదనలు ముందుకు సాగలేదని, ఇప్పుడు గోదావరి-కావేరి అనుసంధానం పేరుతో కొత్త ప్రయత్నాలు జరుగుతున్నాయని అన్నారు.బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఏపీ నేతలు ఇలాంటి ప్రతిపాదనలు చేయలేదని హరీశ్‌రావు పేర్కొన్నారు. రేవంత్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాతే ఏపీ పాలకులు కొత్త ప్రతిపాదనలను తెరపైకి తెస్తున్నారని ఆరోపించారు. తెలంగాణ నీటి ప్రయోజనాలను కాపాడటంలో ప్రభుత్వం విఫలమవుతోందని విమర్శించారు.

సినిమా పాటలకు డ్యాన్స్ చేస్తే కఠిన చర్యలు

మొదటి పేజీ తరువాయి

ఉత్సవాల నిర్వహణకు పోలీసులు విధించిన నిబంధనలు ఉల్లంఘించినట్లు గుర్తిస్తే తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించింది.

అసలేం జరిగిందంటే?

నవరాత్రి ఉత్సవాల పేరుతో సినిమా పాటలకు నృత్యాలు నిర్వహించడాన్ని వ్యతిరేకిస్తూ భారత్ హిందూ మున్నాని రాష్ట్ర కార్యదర్శి దిల్లీ బాబు మద్రాస్ హైకోర్టును ఆశ్రయించారు. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా నవరాత్రి పండుగను జరుపుకుంటారని, ఈ సందర్భంగా ముగ్గురు దేవతల కథలను పాటలు, నృత్యాల ద్వారా తర్వాతి తరాలకు అందిస్తారని ఆయన తన పిటిషన్‌లో పేర్కొన్నారు. కానీ ఇప్పుడు డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో చెన్నైలోని ప్రైవేటు హోటళ్లలో నవరాత్రి ఉత్సవాలను నిర్వహిస్తున్నారని ఆరోపించారు. చెన్నైలోని రాయపేటలో ఉన్న ఎక్స్‌ప్రెస్ అవెన్యూ మాల్‌లో గతేడాది గుజరాత్‌కు చెందిన ఓ సంస్థ దుర్గాదేవి విగ్రహాన్ని ఏర్పాటు చేసి సినిమా పాటలతో నృత్య కార్యక్రమాలు నిర్వహించిందని తెలిపారు. ఈ ఏడాది కూడా అదే తరహా కార్యక్రమానికి అనుమతి లభించిందని పిటిషన్‌లో పేర్కొన్నారు.నవరాత్రి వేడుకల్లో ఇంగ్లిష్ హిప్‌హాప్, బాలీవుడ్ పాటలు వినిపిస్తున్నాయని, కార్యక్రమానికి వచ్చే యువత మద్యం తీసుకురావడం వల్ల ఇతరులకు ఇబ్బందులు కలుగుతున్నాయని పిటిషనర్ ఆరోపించారు. దీంతో ఉత్సవాల పవిత్రతకు భంగం కలుగుతోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ఇచ్చిన అనుమతిని రద్దు చేయాలని, నిబంధనలకు విరుద్ధంగా వేడుకలు నిర్వహిస్తే చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ విషయంపై అక్టోబర్ 12న తమిళనాడు ప్రభుత్వానికి, పోలీసులకు వినతిపత్రం సమర్పించినప్పటికీ స్పందన రాలేదని తెలిపారు.

హైకోర్టులో వాదనలు

పిటిషనర్ తరఫున న్యాయవాది రిచర్డ్‌సన్ విల్సన్ వాదనలు వినిపించారు. నవరాత్రి వేడుకల్లో గర్బా, దాండియా నృత్యాలు సంప్రదాయంలో భాగమేనని, అయితే ఎలాంటి పాటలు వినిపిస్తున్నారు, మద్యం అందిస్తున్నారా వంటి అంశాలను పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. ఈ నేపథ్యంలో కార్యక్రమానికి పోలీసులు ఇచ్చిన అనుమతిని రద్దు చేయాలని అభ్యర్థించారు. వాదనలు విన్న జస్టిస్ వి. లక్ష్మీనారాయణన్, నవరాత్రి వేడుకల్లో సినిమా పాటలకు నృత్యాలు చేయడం సరైనది కాదని వ్యాఖ్యానించారు. ఉత్సవాల నిర్వహణకు పోలీసులు విధించిన షరతులను ఉల్లంఘించినట్లు గుర్తిస్తే వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం కేసును ముగించారు.

తెలంగాణలో తీవ్ర కరవు

మొదటి పేజీ తరువాయి

కోరారు.కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన 'ఖేత్ బచావో అభియాన్' వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని వ్యవసాయ సంక్షోభాన్ని ఆయన కేంద్రం దృష్టికి తీసుకెళ్లారు. మద్దతు ధరతో మొక్కజొన్న, జొన్న తదితర పంటలను 100 శాతం కొనుగోలు చేయాలని, ధరల మద్దతు పథకం కింద ఉన్న 25 శాతం కొనుగోలు పరిమితిని ఎత్తివేయాలని విజ్ఞప్తి చేశారు. రసాయన ఎరువుల ధరలు, సబ్సిడీలను హేతుబద్ధీకరించడంతో పాటు, వ్యవసాయ కూలీలకు ఉపాధి కల్పనలో ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు.ఇదే అంశంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరిగిన అనధికారిక క్యాబినెట్ సమావేశంలోనూ సుదీర్ఘంగా చర్చ జరిగింది. రాష్ట్రంలోని 315 మండలాల్లో కరవు పరిస్థితులు ఉన్నాయని, వాటిలో 101 మండలాల్లో తీవ్ర కరవు, 214 మండలాల్లో ఓ మోస్తరు కరవు నెలకొందని అధికారులు ప్రభుత్వానికి నివేదించారు. పంట నష్టపోయిన రైతులకు అండగా నిలిచేందుకు రూ. 1,986.89 కోట్లతో కూడిన సహాయ ప్యాకేజీని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించింది.గణాంకాల ప్రకారం, జూన్ 1 నుంచి సెప్టెంబర్ 30 మధ్య రాష్ట్రంలో సాధారణంగా 740.6 మి.మీ. వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా, కేవలం 615.5 మి.మీ. మాత్రమే నమోదైంది. అక్టోబర్ 15 నాటికి ఈ వర్షపాత లోటు 23 శాతానికి చేరింది. దీని ప్రభావంతో గత ఏడాదితో పోలిస్తే సాగు విస్తీర్ణం 13.22 లక్షల ఎకరాలు తగ్గి, 126.06 లక్షల ఎకరాలకు పరిమితమైంది. అత్యధికంగా నల్గొండ జిల్లాలో 3.58 లక్షల ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయి.మరోవైపు, రాష్ట్రంలోని ప్రధాన జలాశయాల్లో నీటి నిల్వలు ప్రమాదకర స్థాయికి పడిపోయాయి. 466 టీఎంసీల పూర్తి సామర్థ్యానికి గాను ప్రస్తుతం కేవలం 209.45 టీఎంసీల నీరు మాత్రమే అందుబాటులో ఉంది. ఈ పరిస్థితుల్లో తాగునీటి అవసరాలకే ప్రథమ ప్రాధాన్యం ఇవ్వాలని, సాగునీటి విడుదలను పరిమితం చేయాలని అధికారులు ప్రభుత్వానికి సిఫార్సు చేశారు. కరవును అధికారికంగా ప్రకటించి, కేంద్రం నుంచి గరిష్ఠంగా సాయం పొందేందుకు రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర నివేదికను సిద్ధం చేస్తోంది.




బావాయిపల్లిలో రీ-సర్వే పనులను పరిశీలించిన అదనపు కలెక్టర్ బి.చెన్నయ్య

రీ సర్వే ప్రక్రియను పారదర్శకంగా,పకడ్బందీగా నిర్వహించాలి

కొల్లాపూర్,మన ప్రజాపక్షం:
నాగర్ కర్నూల్ జిల్లా కొల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని కోడేరు మండలం బావాయిపల్లి గ్రామంలో కొనసాగుతున్న భూముల రీ సర్వే పనులను జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ బి.చెన్నయ్య శనివారం పరిశీలించారు.ఈ సందర్భంగా గ్రామంలో జరుగుతున్న రీ సర్వే పనుల పురోగతిని క్షేత్రస్థాయిలో పరిశీలించి,సంబంధిత అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.సర్వే ప్రక్రియలో చేపడుతున్న చర్యలు, ఇప్పటివరకు పూర్తయిన పనులు,మిగిలి ఉన్న పనుల వివరాలపై ఆరా తీశారు.భూముల రీ సర్వే ప్రక్రియను పారదర్శకంగా,పకడ్బందీగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ అధికారులకు సూచించారు.సర్వే పనుల్లో ఖచ్చితత్వానికి ప్రాధాన్యత ఇవ్వాలని, నిబంధనలకు అనుగుణంగా ప్రక్రియను పూర్తి చేయాలని తెలిపారు.రీ సర్వే ద్వారా భూములకు సంబంధించిన వివరాలు స్పష్టంగా నమోదు అయ్యేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.ప్రజలకు భూములకు సంబంధించిన వివరాల విషయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా,రీ సర్వే పనులను బాధ్యతాయుతంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు.అదనపు కలెక్టర్ వెంట సంబంధిత రెవెన్యూ అధికారులు,సర్వే సిబ్బంది తదితరులు ఉన్నారు.

ఉద్యమకారుడు ఇరుగు రమేష్‌కి డా.రాజమౌళి ఆర్థిక సాయం

జనగామ,మన ప్రజాపక్షం:
జనగామ జిల్లా ఉద్యమకారుడు ఇరుగు రమేష్ ఇటీవల తీవ్ర అనారోగ్య సమస్యలతో బాధపడుతూ హైదరాబాద్‌లోని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. వైద్యం కోసం భారీగా ఖర్చవుతుండటంతో ఆయన తీవ్ర ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఈ విషయాన్ని ఇటీవలే జరిగిన జనగామ జిల్లా ఆవిర్భావ దినోత్సవ సమావేశంలో పలువురి దృష్టికి తీసుకువచ్చారు. ?ఈ నేపథ్యంలో రమేష్ ఆర్థిక పరిస్థితిని తెలుసుకున్న ప్రముఖ వైద్యులు డా రాజమౌళి వెంటనే స్పందించారు. ఆయన వైద్య ఖర్చుల నిమిత్తం రూ.5 వేలు ఆర్థిక సహాయాన్ని శనివారం రమేష్‌కి అందజేశారు. కష్టకాలంలో తనకు ఆర్థికంగా చేయూతనందించిన డా.రాజమౌళి కి ఉద్యమకారుడు ఇరుగు రమేష్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.





తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక సద్దుల బతుకమ్మ

సద్దుల బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలిపిన ఎంపి డాక్టర్ కడియం కావ్య

జనగామ, మన ప్రజాపక్షం:
సద్దుల బతుకమ్మ పండుగను పురస్కరించుకుని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ ప్రజలకు, ముఖ్యంగా ఆడబిడ్డలకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల వైభవానికి బతుకమ్మ పండుగ ప్రతీక అని, ప్రకృతిని ఆరాధిస్తూ, పూలను పూజిస్తూ మహిళలు భక్తిశ్రద్ధలతో జరుపుకునే ఈ పండుగ మన రాష్ట్ర ప్రత్యేకతను ప్రపంచానికి చాటిచెబుతుందని ఎంపీ పేర్కొన్నారు.తీరొక్క పూలతో అందంగా పేర్చిన బతుకమ్మల చుట్టూ ఆడబిడ్డలు ఆటపాటలతో, ఆనందోత్సాహాల మధ్య సద్దుల బతుకమ్మ వేడుకలను ఘనంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. తరతరాలుగా వస్తున్న తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించడంలో బతుకమ్మ పండుగ కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు.సద్దుల బతుకమ్మ ప్రతి ఇంటా సంతోషాల సిరులు కురిపించాలని, ప్రతి కుటుంబంలో సుఖశాంతులు, ఆయురారోగ్యాలు, సిరిసంపదలు వెల్లివిరియాలని, తెలంగాణ సంస్కృతి వైభవం కలకాలం పరిఢవిల్లాలని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య ఆకాంక్షించారు.

నూతన జిల్లా రవాణా శాఖ కార్యాలయంలో ఆర్టీఏ సేవలు ప్రారంభం

కొల్లాపూర్ చౌరస్తా వద్ద కలెక్టరేట్ సమీపంలో అందుబాటులోకి సేవలు
ప్రజలు,వాహనదారులు నూతన కార్యాలయ సేవలను సద్వినియోగం చేసుకోవాలి
జిల్లా రవాణా అధికారి ఇమ్రాన్ అహ్మద్





నాగర్ కర్నూల్,మన ప్రజాపక్షం:
నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని కొల్లాపూర్ చౌరస్తా వద్ద కలెక్టరేట్ సమీపంలో నూతనంగా నిర్మించి ఇటీవలే రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ చే ప్రారంభించిన నూతన జిల్లా రవాణా శాఖ కార్యాలయంలో ఆర్టీఏ సేవలు శుక్రవారం నుంచి ప్రారంభమైనట్లు జిల్లా రవాణా అధికారి ఇమ్రాన్ అహ్మద్ తెలిపారు. నూతన కార్యాలయం నుంచి రవాణా శాఖకు సంబంధించిన సేవలను ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చినట్లు ఆయన శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.జిల్లా ప్రజలకు రవాణా శాఖ సేవలను మరింత చేరువ చేయడంతోపాటు,వాహనదారులకు మెరుగైన సౌకర్యాలు కల్పించే లక్ష్యంతో నూతన కార్యాలయాన్ని శుక్రవారం నుండి అందుబాటులోకి తీసుకొచ్చినట్లు తెలిపారు.జిల్లా కేంద్రంలోని ప్రధాన ప్రాంతమైన కొల్లాపూర్ చౌరస్తా వద్ద, కలెక్టరేట్ సమీపంలో కార్యాలయం ఏర్పాటు చేయడం వల్ల నాగర్ కర్నూలు జిల్లా నలుమూలల వివిధ ప్రాంతాల నుంచి వచ్చే ప్రజలకు కార్యాలయాన్ని చేరుకోవడం సులభతరమవుతుందని ఆయన తెలిపారు.రవాణా శాఖకు సంబంధించిన పనుల కోసం కార్యాలయానికి వచ్చే ప్రజలకు అవసరమైన సేవలను సులభంగా అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. వాహనదారులు తమ వాహనాలకు సంబంధించిన రవాణా శాఖ పనులు, డ్రైవింగ్ లైసెన్సులు, వాహనాల రిజిస్ట్రేషన్లు తదితర సేవల కోసం నూతన కార్యాలయాన్ని సంప్రదించవచ్చని తెలిపారు. సంబంధిత సేవలను పొందేందుకు అవసరమైన పత్రాలతో కార్యాలయానికి రావాలని సూచించారు.నూతన కార్యాలయంలో ఆర్టీఏ సేవలు ప్రారంభం కావడంతో జిల్లా ప్రజలకు రవాణా శాఖ సేవలు మరింత అందుబాటులోకి తీసుకురావడం జరిగిందన్నారు. ప్రజలు, వాహనదారులు ఈ సౌకర్యాన్ని వినియోగించుకొని తమ రవాణా శాఖ సంబంధిత పనులను సకాలంలో పూర్తి చేసుకోవాలని జిల్లా రవాణా అధికారి ఇమ్రాన్ అహ్మద్ కోరారు.

నాగర్‌కర్నూల్ కలెక్టరేట్‌లో ఘనంగా బతుకమ్మ సంబరాలు

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాలి
అదనపు కలెక్టర్ బి.చెన్నయ్య

నాగర్ కర్నూల్,మన ప్రజాపక్షం:
తెలంగాణ సంస్కృతి,సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను పురస్కరించుకుని శనివారం సాయంత్రం నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టరేట్‌లో గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో స్వయం సహాయక మహిళా సంఘాల భాగస్వామ్యంతో బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు.ఈ వేడుకల్లో జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ బి.చెన్నయ్యతో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులు,మహిళా ఉద్యోగులు,స్వయం సహాయక మహిళా సంఘాల సభ్యులు ఉత్సాహంగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా కలెక్టరేట్ ప్రాంగణంలో మహిళలు వివిధ రకాల రంగురంగుల పూలతో అందంగా బతుకమ్మలను పేర్చి, సంప్రదాయబద్ధంగా పూజలు నిర్వహించారు.అనంతరం బతుకమ్మ పాటలు పాడుతూ బతుకమ్మల చుట్టూ ఆడిపాడారు. దీంతో కలెక్టరేట్ ప్రాంగణమంతా పండుగ శోభను సంతరించుకుంది. మహిళల ఆటపాటలతో సందడిగా మారిన వాతావరణం అందరినీ ఆకట్టుకుంది.ఈ సందర్భంగా జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ బి.చెన్నయ్య మాట్లాడుతూ బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని అన్నారు.ప్రకృతిలో లభించే వివిధ రకాల పూలతో



బతుకమ్మలను పేర్చి,మహిళలంతా ఒకచోట చేరి ఆనందోత్సాహాల మధ్య ఈ పండుగను జరుపుకోవడం తెలంగాణ ప్రత్యేకత అని తెలిపారు.బతుకమ్మ పండుగ మహిళల్లో ఐక్యతను, సోదరభావాన్ని పెంపొందించడంతో పాటు ప్రకృతితో మనిషికి ఉన్న అనుబంధాన్ని చాటిచెబుతుందని తెలిపారు.తెలంగాణ ప్రత్యేకతను చాటిచెప్పే పండుగలను భావితరాలకు పరిచయం చేయడంతో పాటు,మన సంస్కృతి,సంప్రదాయాలను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని అదనపు కలెక్టర్ పేర్కొన్నారు.మహిళలు కుటుంబ బాధ్యతలతో పాటు సామాజిక, ఆర్థిక రంగాల్లోనూ కీలక పాత్ర పోషిస్తున్నారని,స్వయం సహాయక మహిళా సంఘాల సభ్యులు ఇలాంటి సాంస్కృతిక కార్యక్రమాల్లో ఉత్సాహంగా పాల్గొనడం అభినందనీయమని అన్నారు.గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో స్వయం సహాయక మహిళా సంఘాల భాగస్వామ్యంతో నిర్వహించిన బతుకమ్మ సంబరాలు మహిళల్లో ఉత్సాహాన్ని నింపాయి.సంప్రదాయబద్ధంగా నిర్వహించిన ఈ వేడుకలు తెలంగాణ పూల పండుగ విశిష్టతను మరోసారి చాటిచెప్పాయి.ఈ కార్యక్రమంలో డిఆర్ఓ పాండు,పిడి డిఆర్డిఏ చిన్న ఓబులేసు,అదనపు పిడి రాజేశ్వరి,వివిధ శాఖల జిల్లా అధికారులు,మహిళా ఉద్యోగులు,స్వయం సహాయక మహిళా సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా పార్టీ శ్రేణులు సమష్టిగా కృషి చేయాలి

మంత్రి జూపల్లి కృష్ణారావు

మహబూబ్‌నగర్,మన ప్రజాపక్షం:
ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి,సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లి, పాలమూరు-రంగారెడ్డి-హైదరాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి సామ రామ్మోహన్‌రెడ్డి విజయానికి కృషి చేయాలని మంత్రి జూపల్లి కృష్ణారావు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ చేస్తున్న అసత్య ప్రచారాన్ని వాస్తవాలతో తిప్పికొట్టాలని సూచించారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో నిర్వహించిన ఎన్నికల సన్నాహక సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సామ రామ్మోహన్‌రెడ్డి నిబద్ధత కలిగిన కాంగ్రెస్ కార్యకర్త అని, పార్టీ బలోపేతానికి ఎంతో కష్టపడి పనిచేస్తున్నారని మంత్రి పేర్కొన్నారు. ఆయన విజయానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని కోరారు.రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఆశాజనకంగా లేకపోయినా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తోందని జూపల్లి తెలిపారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను పట్టభద్రులకు వివరించి కాంగ్రెస్ అభ్యర్థికి మద్దతు కోరాలని సూచించారు.ప్రజా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక బీఆర్ఎస్ నాయకులు అసత్య



ప్రచారంతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని మంత్రి విమర్శించారు. ప్రతిపక్ష ఆరోపణలను ఎక్కడికక్కడ వాస్తవాలతో తిప్పికొట్టాలని పార్టీ శ్రేణులకు సూచించారు.కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో జరిగిన స్థానిక సంస్థలు, మున్సిపాలిటీలు, అసెంబ్లీ ఉప ఎన్నికల్లో పార్టీ విజయాలు సాధించిందని జూపల్లి పేర్కొన్నారు. అదే స్ఫూర్తితో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించాలని పిలుపునిచ్చారు.రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ కార్యక్రమాలు, అభివృద్ధి పనులే ఎన్నికల్లో పార్టీకి




ప్రధాన బలమని మంత్రి అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం సాధించిన ప్రగతిని పట్టభద్రులకు వివరించి, అభ్యర్థి విజయానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో మంత్రి వాకిటి శ్రీహరి,ఎంపి డా.మల్లు రవి, ఎమ్మెల్యేలు యెన్నెం శ్రీనివాస్ రెడ్డి, అనిరుద్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, శంకరయ్య,మేఘా రెడ్డి, ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్ రెడ్డి,మాజీ ఎమ్మెల్యే ఎస్.ఏ సంపత్ కుమార్ మరియు కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఐదో రోజుకు చేరిన ఎన్ హెచ్ ఎం ఉద్యోగుల నిరవధిక సమ్మె

కొల్లాపూర్ ఎక్స్ రోడ్‌లో భిక్షాటన ర్యాలీతో వినూత్న నిరసన

నాగర్‌కర్నూల్,మన ప్రజాపక్షం:జాతీయ ఆరోగ్య మిషన్ పరిధిలో వివిధ క్యాడర్లలో పనిచేస్తున్న ఉద్యోగుల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం చేపట్టిన నిరవధిక సమ్మె శనివారం ఐదో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా నాగర్‌కర్నూల్ జిల్లా ఎన్హెచ్ఎం ఉద్యోగులు కొల్లాపూర్ ఎక్స్ రోడ్‌లో భిక్షాటన ర్యాలీ నిర్వహించి వినూత్న రీతిలో నిరసన తెలిపారు. తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.రాష్ట్ర వ్యాప్తంగా ఎన్హెచ్ఎం పరిధిలోని 78 క్యాడర్లలో పనిచేస్తున్న సుమారు 17 వేల మంది ఉద్యోగులను ఎలాంటి షరతులు లేకుండా రెగ్యులరైజ్ చేయాలని ఉద్యోగ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. అనేక సంవత్సరాలుగా ప్రజలకు వైద్య సేవలు అందిస్తూ ప్రజారోగ్య పరిరక్షణలో కీలక పాత్ర పోషిస్తున్న ఎన్హెచ్ఎం ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని కోరారు.గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణాల వరకు వివిధ ఆరోగ్య కార్యక్రమాల అమలులో ఎన్హెచ్ఎం ఉద్యోగులు నిరంతరం సేవలందిస్తున్నారని, అయినప్పటికీ తమకు ఉద్యోగ



భద్రత లేకపోవడం ఆవేదన కలిగిస్తోందని నాయకులు పేర్కొన్నారు. ఉద్యోగుల కుటుంబాల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం తక్షణమే సానుకూల నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకే భిక్షాటన ర్యాలీ నిర్వహించినట్లు ఉద్యోగ సంఘం నాయకులు తెలిపారు.ఎన్హెచ్ఎం ఉద్యోగుల సమస్యలను ఇకనైనా ప్రభుత్వం



పరిష్కరించి, వారందరికీ షరతులు లేని రెగ్యులరైజేషన్ కల్పించాలని డిమాండ్ చేశారు. డిమాండ్లు పరిష్కారమయ్యే వరకు ఐక్యంగా ఉద్యమాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో ఎన్హెచ్ఎం జేఏసీ నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షులు డా బాలకృష్ణ, ప్రధాన కార్యదర్శి దామగట్ల కుమార్, ఎన్హెచ్ఎం జేఏసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు గౌస్ పాషా,డా.జగన్, డా.రామకృష్ణ రెడ్డి, సాయి కంఠ, డా.మహతి, డా. సంధ్య రాణి, వివిధ విభాగాలకు చెందిన ఎన్హెచ్ఎం ఉద్యోగులు పాల్గొని తమ నిరసనను తెలియజేశారు.

మక్తల్-నారాయణపేట నాలుగు లైన్ల రోడ్డు పనులు ప్రారంభించాలని మాజీ ఎమ్మెల్యే పాదయాత్ర

మక్తల్,మన ప్రజాపక్షం:మక్తల్ నుండి నారాయణపేట వరకు 237 కోట్లతో నిర్మించనున్న నాలుగు లైన్ల రోడ్డు పనులు వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేస్తూ పాదయాత్ర చేపట్టారు మక్తల్ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి. ఈ పాదయాత్ర మక్తల్ నుండి ఉట్కూర్ మీదుగా నారాయణపేట జిల్లా కేంద్రానికి చేరుకోనుందని ఈ పాదయాత్రలో మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డితో పాటు బీఆర్ఎస్ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా మక్తల్ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు.కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి మూడు సంవత్సరాలైనా కూడా మక్తల్ నుంచి నారాయణపేట రోడ్డుకు మోక్షం రావడం లేదనీ, ముఖ్యమంత్రి మరియు ముగ్గురు మంత్రులు వచ్చి శంకుస్థాపనలు చేస్తున్నా పనులు ప్రారంభం కాలేదని,బీటీ రోడ్డు మీద బీటీ రోడ్డు వేయాలి కానీ మొరవేయడం చాలా తప్పు అని,ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సొంత నియోజకవర్గం కొడంగల్ లోనే మొత్తం రోడ్లు సింగిల్ రోడ్డు ఉంటే డబుల్ రోడ్డు, డబుల్ రోడ్డు ఉంటే ఫోర్ లైన్ రోడ్డు వేసుకుంటూ తన తాలూకా వరకు మాత్రం రోడ్లు మార్చుకుంటున్నారని ఆరోపించారు. మక్తల్, నారాయణపేటలో మాత్రం కనీసం రోడ్డు సరిగ్గా లేదని కలెక్టరేట్ కి వెళ్లాలన్నా కూడా కనీసం 20 నిమిషాలు పట్టే చోట, గంట పైన టైం తీసుకుంటుందని,బీఆర్ఎస్ పార్టీ తరపున అభివృద్ధిని ఆకాంక్షిస్తున్నామని రేవంత్ రెడ్డి మరియు ఆయన కుటుంబం అభివృద్ధికి ఆకాంక్షించే కుటుంబం



అయినప్పుడు కనీసం ఇక్కడ ఉన్న రోడ్లకు గుంతలు పూడ్చలేని పరిస్థితిలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉందని విమర్శించారు.ఈ రోడ్డు కోసమే మక్తల్ నుంచి నారాయణపేట వరకు పాదయాత్ర ప్రారంభించానని, రోడ్డు పనులు వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు.

అంతర్రాష్ట్ర గంజాయి అక్రమ రవాణా ముఠా పట్టివేత...ముగ్గురు నిందితుల అరెస్ట్

1.4 కిలోల గంజాయి,స్కూటీ,మూడు మొబైల్ ఫోన్లు,రూ.7వేలు నగదు స్వాధీనం

నిందితులకు డ్రగ్ టెస్ట్...ముగ్గురికీ పాజిటివ్

జిల్లా ఎస్పీ డాక్టర్ జి.వినీత్

నారాయణపేట,మన ప్రజాపక్షం:
జిల్లా పరిధిలో గంజాయి, ఇతర మాదకద్రవ్యాల అక్రమ రవాణా, విక్రయాలు,వినియోగాన్ని అరికట్టేందుకు జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో ప్రత్యేక నిఘా, తనిఖీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎస్పీ డాక్టర్ జి.వినీత్ తెలిపారు.ఈ క్రమంలో 17.10.2026న మక్తల్ పట్టణంలోని రామ్‌లీలా మైదానం వద్ద పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా స్కూటీపై వచ్చిన ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని తనిఖీ చేయగా వారి వద్ద గంజాయి లభించింది. పోలీసులు మొత్తం 1.4 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అలాగే గంజాయి రవాణాకు ఉపయోగించిన స్కూటీ, మూడు మొబైల్ ఫోన్లు, రూ.7,000 నగదును స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ సుమారు రూ.60,000 ఉంటుందని అంచనా వేశారు.నిందితులకు డ్రగ్ టెస్ట్ నిర్వహించగా ముగ్గురికీ పాజిటివ్‌గా వచ్చినట్లు పోలీసులు తెలిపారు.ఈ సందర్భంగా అరెస్టు చేసిన నిందితుల వివరాలు మీడియా సమావేశంలో వెల్లడించారు.ఓం అశోక్ కొరాడి, వయస్సు 22 సంవత్సరాలు, రాయచూర్, కర్ణాటక రాష్ట్రం, రాజశేఖర్ రాంచందర్ హూనరావ్, వయస్సు 60 సంవత్సరాలు, దక్షిణ సోలాపూర్, మహారాష్ట్ర రాష్ట్రం, ఎం.డి. యాసీన్ బందెనవాజ్ మఖాన్ దార్, వయస్సు 37 సంవత్సరాలు, సోలాపూర్, మహారాష్ట్ర రాష్ట్రం.ప్రాథమిక దర్యాప్తు ప్రకారం



నిందితులు మహారాష్ట్ర రాష్ట్రం నుంచి గంజాయిని కొనుగోలు చేసి, రాయచూర్ మీదుగా మక్తల్ పట్టణంతో పాటు పరిసర ప్రాంతాలకు తీసుకువచ్చి విక్రయిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. ఈ అక్రమ కార్యకలాపాల వెనుక మరికొందరి ప్రమేయం ఉందా, గంజాయి సరఫరా ఎక్కడి నుంచి జరుగుతోంది, ఈ వ్యవహారంలో ఆర్థిక లావాదేవీలు ఎలా సాగుతున్నాయనే అంశాలపై పోలీసులు లోతుగా దర్యాప్తు చేస్తున్నారు.ఈ ఘటనకు సంబంధించి మక్తల్ పోలీస్ స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ నెం.428/2026 నమోదు చేసి,ఎన్డిపిఎస్ యాక్ట్ సెక్షన్ 8(సి)ఆర్/డబ్ల్యూ 20(బి)(అఐ)(బి), సెక్షన్ 27(బి) కింద కేసు నమోదు చేసినట్లు తెలిపారు. తదుపరి దర్యాప్తు కొనసాగుతోంది. మాదకద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు.డ్రగ్స్, గంజాయి, ఇతర మాదకద్రవ్యాల అక్రమ రవాణా, విక్రయాలు, వినియోగం వ్యక్తిగత జీవితాలతో పాటు సమాజానికి తీవ్ర నష్టం కలిగిస్తాయని, ముఖ్యంగా యువత భవిష్యత్తుపై ప్రతికూల ప్రభావం చూపుతాయని జిల్లా ఎస్పీ తెలిపారు. యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటూ విద్య, ఉపాధి, క్రీడలు, ఆరోగ్యకరమైన జీవనశైలిపై దృష్టి సారించాలని సూచించారు. ఇప్పటికే మాదకద్రవ్యాల వినియోగానికి అలవాటు పడిన వారు వైద్యులు, నిపుణుల సహాయం తీసుకుని ఆ అలవాటు నుంచి బయటపడాలని కోరారు.జిల్లాలో ఎక్కడైనా గంజాయి అక్రమ రవాణా, నిల్వ లేదా విక్రయాలకు సంబంధించిన సమాచారం తెలిస్తే ప్రజలు వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు తెలియజేయాలని, మాదకద్రవ్యాల రహిత సమాజ నిర్మాణంలో పోలీసులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.ఈ సందర్భంగా మక్తల్, టాస్క్ ఫోర్స్ పోలీసులకు జిల్లా ఎస్పీ అభినందనలు తెలిపారు.డీఎస్పీ నల్లపు లింగయ్య పర్యవేక్షణలో సమర్థవంతంగా నిఘా ఏర్పాటు చేసి, గంజాయి అక్రమ రవాణా చేస్తున్న ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకుని గంజాయిని స్వాధీనం చేసుకోవడంలో కృషి చేసిన మక్తల్ సీఐ రామ్ లాల్, మక్తల్ ఎస్ఐ రాజు, టాస్క్ ఫోర్స్ ఎస్ఐ పురుషోత్తం, టాస్క్ ఫోర్స్ సిబ్బందిని జిల్లా ఎస్పీ డాక్టర్ జి. వినీత్ అభినందించారు.

వెల్టూర్‌లో కోతుల బీభత్సం.. గ్రామస్తులపై వరుస దాడులు!

మహిళకు గాయాలు..

భయాందోళనలో గ్రామ ప్రజలు

కోతుల బెడద నుంచి విముక్తి కల్పించాలంటున్న గ్రామస్తులు

ఉప్పునుంతల,మన ప్రజపక్షం:
నాగర్‌కర్నూల్ జిల్లా ఉప్పునుంతల మండలంలోని వెల్టూర్ గ్రామంలో కోతుల బెడద రోజు రోజుకూ పెరుగుతోంది. గుంపులుగా సంచరిస్తున్న కోతులు ఇళ్లలోకి చొరబడటమే కాకుండా, గ్రామస్తులపై దాడులకు పాల్పడుతుండటంతో ప్రజలు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. శనివారం ఉదయం గ్రామంలోని బస్టాండ్ ఆవరణలో నివసిస్తున్న బూసిరాజ్ బాలమ్మ ఇంటి నుంచి బయటకు రాగానే నాలుగైదు కోతులు ఒక్కసారిగా ఆమెపై దాడి చేసినట్లు గ్రామస్తులు తెలిపారు. ఈ ఘటనలో ఆమె కాలుకు గాయాలయ్యాయి. అకస్మాత్తుగా కోతులు దాడి



చేయడంతో ఆమె భయాందోళనకు గురైనట్లు పేర్కొన్నారు. బయటకు రావాలంటేనే భయం పుడుతుందని, గ్రామంలో గతంలోనూ పలువురిపై కోతులు దాడి చేసిన ఘటనలు చోటుచేసుకున్నాయని స్థానికులు చెబుతున్నారు. ఇళ్లలోకి చొరబడుతూ, బయటకు వెళ్లే సమయంలో దాడులు చేస్తుండటంతో చిన్నారులు, విద్యార్థులు, మహిళలు రహదారులపైకి రావాలంటేనే భయపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.గ్రామ పంచాయతీ సర్పంచ్, సిబ్బంది, స్థానిక నాయకులు గతంలో కోతులను తరిమివేసేందుకు ప్రయత్నించినప్పటికీ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించడం లేదని పలువురు పేర్కొంటున్నారు. సంబంధిత అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించి, కోతులను పట్టుకునే నిపుణుల సహాయంతో సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు. వెల్టూర్‌తో పాటు పలు గ్రామాల్లో కోతులు, వీధికుక్కల బెడద పెరుగుతుండటంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని గ్రామస్తులు వాపోయారు.ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి, కోతుల బెడదను నియంత్రించేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని, ప్రజలకు రక్షణ కల్పించాలని కోరుతున్నారు.కోతుల దాడులతో ప్రజలు గాయపడుతున్న నేపథ్యంలో అధికారులు ఇకనైనా స్పందించి శాశ్వత పరిష్కారం చూపుతారా? అని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు.

జిల్లా రచయితల సంఘం అధ్యక్షులుగా పెద్దిరెడ్డి గణేష్ ఏకగ్రీవ ఎన్నిక

సూర్యాపేట,మన ప్రజాపక్షం:సూర్యాపేట జిల్లా కేంద్రంలో జరిగిన కవులు, రచయితల సమావేశంలో సూర్యాపేట జిల్లా రచయితల సంఘం ఏర్పాటు అయింది. ఇటీవల సూర్యాపేట జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల్లో హుజూర్నగర్, కోదాడ, సూర్యాపేట, తుంగతుర్తి నియోజకవర్గ రచయితల సంఘాలు ఏర్పాటు చేయడం జరిగింది. ఈ నాలుగు నియోజకవర్గాల కార్యవర్గాల విస్తృతస్థాయి సమావేశంలో పాల్గొన్న కార్యవర్గ సభ్యులు కవులు రచయితలు కలిసి శనివారం సుధా బ్యాంక్ లో సూర్యాపేట జిల్లా రచయితల సంఘాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రముఖ కవి రచయిత, సాహితీవేత్త పెద్దిరెడ్డి గణేష్ సూర్యాపేట జిల్లా రచయితల సంఘం అధ్యక్షులుగా, ప్రముఖ కవి పిల్లల మరి వినవీరభద్రం కళాపీఠం వ్యవస్థాపకులు శీలా అవిలేను ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైనట్లు పేర్కొన్నారు. ఈ సంఘానికి జిల్లాలోని సీనియర్ రచయిత ఆలేటి శంకర్ ను సంఘం గౌరవ అధ్యక్షులుగా ఎన్నుకున్నారు. నూతనంగా ఏర్పడిన జిల్లా రచయితల సంఘం గౌరవ సలహాదారులుగా బెల్లంకొండ శ్రీరాములు, గడ్డం నర్సయ్య, తుమ్మరాజాలను నియమించారు. అదేవిధంగా ఉపాధ్యక్షులుగా ధర్మారి వెంకటేశ్వర్లు, పుప్పాల కృష్ణమూర్తి, ఎర్ర హరికిషన్, సంయుక్త కార్యదర్శులుగా గొడితాల వెంకటేశ్వర్లు, వేముల వెంకటేశ్వర్లు, సరికొండ నరసింహారాజు,ప్రచార కార్యదర్శిగా పబ్బతి వెంకటేశ్వర్లు,కార్యవర్గ సభ్యులుగా ముక్కామల జానకి రాములు, ఏబెల్ శశి, ఎన్.నీ.రోజా,పూసోజు పద్మ, పోతుగంటి వీరాచారి, జిల్లేపల్లి జానయ్య, కొర్రపిడత శ్రీనివాస్, లింగాల శ్రీనివాస్, కొండా లింగారావు, తదితరులను ఎన్నుకున్నట్లు తెలియజేశారు. ఈ సందర్భంగా నూతన సూర్యాపేట జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు పెద్దిరెడ్డి గణేష్ మాట్లాడుతూ సాహిత్య సాంస్కృతిక రంగంలో కవులు రచయితలను ఒక తాటిపై నడిపి సూర్యాపేట సాహిత్యరంగాన్ని సుసంపన్నం చేస్తామని నూతన వర్తమాన కవులు రచయితలకు ప్రోత్సాహం ఇస్తూ వారి రచనలను వెలుగులోకి తీసుకురావడానికి ప్రయత్నం చేస్తామన్నారు. తెలుగు భాషను సుసంపన్నం చేసే దిశగా అనేక కార్యక్రమాలు తీసుకుంటామన్నారు. కవిత్వ కార్యశాలలతో పాటు, తెలుగు భాష విస్తృతికి ఉన్నతికి తెలుగు భాషా ఉపాధ్యాయులను కలిసి కృషి చేసేలా ప్రయత్నం చేస్తామని అన్నారు. పాఠశాలల్లో క్షేత్రస్థాయిలో విద్యార్థులకు వక్తృత్వ, వ్యాసరచన కవిత్వ, కథా పోటీలు నిర్వహించి ప్రోత్సహిస్తామని సూర్యాపేట జిల్లా రచయితల సంఘం ఆ బాధ్యతను తీసుకుంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుండి విచ్చేసిన అనేకమంది కవులు రచయితలు సాహితీప్రియులు పాల్గొన్నారు.





స్వర్ణకారులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

సూర్యాపేట,మన ప్రజాపక్షం:
రాష్ట్ర ప్రభుత్వం స్వర్ణకారుల ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి ఆదుకోవాలని తెలంగాణ రాష్ట్ర స్వర్ణకార సంఘం జిల్లా అధ్యక్షుడు తోగిటి మురళి అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని ఆ సంఘ కార్యాల ఆవరణలో ఈనెల 24వ తేదీన హైదరాబాద్ సరూర్ నగర్ గ్రౌండ్ లో జరిగే స్వర్ణకార శంఖారావం భారీ బహిరంగ సభ వాల్ పోస్టర్లు, కరపత్రాలు ఆవిష్కరించి మాట్లాడారు. ఎన్నో పోరాటాల ద్వారా సాధించుకున్న తెలంగాణలో స్వరాష్ట్ర ఉద్యమంలో విశ్వబ్రాహ్మణ పాత్ర గణనీయమైందని గుర్తు చేశారు. మల్లీ దశ ఉద్యమ తొలి అమరుడు కాసోజు శ్రీకాంత్ చారి బలిదానంతో పాటు 22 మందికి పైగా విశ్వబ్రాహ్మణులు ప్రాంతం చేశారని బంగారు తెలంగాణలో సమిదలుగా మారారు అన్నారు. రాష్ట్రం వచ్చిన విశ్వబ్రాహ్మణులకు జరిగిన మేలు ఏమి లేదన్నారు. పెద్ద ఎత్తున పెట్టుబడిదారులు కార్పొరేట్ కంపెనీలు జువెలరీ షాపులు ఏర్పాటుచేసి స్వర్ణకారులను చేతివృత్తులను నాశనం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 50 సంవత్సరాలు నిండిన స్వర్ణకార వృత్తిదారులకు నెలకు 5000 రూపాయలు పెన్షన్ ఇవ్వాలని, అన్ని బ్యాంకుల అప్రైజరలకు సీలింగ్ విధానం తొలగించి సమాధానం కమిషన్ ఇవ్వాలని, జీవో నెంబర్ 272 సవరణ చేసి అక్రమ రికవరీలను అరికట్టాలని డిమాండ్ చేశారు.కార్యక్రమంలో రాష్ట్ర స్వర్ణకార సంఘం సలహాదారుడు నారాయణదాసు రామాచారి, జిల్లా కోశాధికారి బాణాల శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు ఆకారపు పరిపూర్ణ, జనరల్ సెక్రెటరీ నారాయణదాసు, నరసింహ చారి, అమరావతి, దామోదర్ చారి, అనుముల బ్రహ్మాచారి, సురేష్, నాగేంద్ర చారి,గోపి,ఉల్లి సుధాకర్, రాంబాబు,నరసింహాచారి, భాస్కరాచారి,వీరాచారి, కృష్ణమాచారి, సాయి పాల్గొన్నారు.



సీసీ కెమెరాల నిఘా నీడలో ఉడుమల్ గిద్ద గ్రామం

సీసీ కెమెరాలతో గ్రామంలో భద్రత

దామరగిద్ద, మన ప్రజాపక్షం
దామరగిద్ద మండలం ఉడుమల్ గిద్ద గ్రామంలో ప్రజల భద్రత, నేరాల నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణే లక్ష్యంగా గ్రామంలో 13 సీసీ కెమెరాలను డీఎస్పీ నల్లపు లింగయ్య, దామరగిద్ద ఎస్సై నరేష్, గ్రామ సర్పంచ్ సత్యమ్మ గోపాల్, గ్రామ పెద్దలు కలిసి ప్రారంభించారు.ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ గ్రామంలో శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు కీలకంగా పనిచేస్తాయని తెలిపారు. గ్రామంలోని ప్రధాన ప్రాంతాల్లో సీసీ కెమెరాల నిఘా ఉండటం వల్ల నేరాలను అరికట్టడంతో పాటు, ఏదైనా ఘటన జరిగినప్పుడు నిందితులను గుర్తించి దర్యాప్తు చేపట్టేందుకు సీసీ కెమెరాల ఫుటేజ్ ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు. సీసీ కెమెరాలు ద్వారా గ్రామంలో భద్రతా ఉంటుందని తెలిపారు.ప్రజలు కూడా సామాజిక బాధ్యతతో వ్యవహరిస్తూ భద్రతా నిబంధనలు పాటించాలని, గ్రామంలో ఎలాంటి అనుమానాస్పద కార్యకలాపాలు కనిపించినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ప్రజల భద్రత కోసం పోలీసు శాఖ చేపడుతున్న చర్యలకు గ్రామస్తులు సహకరించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ సత్యమ్మ గోపాల్, ఉప సర్పంచ్, హెడ్ మాస్టర్ చెనప్ప, రిటైర్డ్ ఉద్యోగులు గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు తది తరులు పాల్గొన్నారు.

జనగామ బీరప్పగడ్డలో ఘనంగా కళావృత్తి కార్యక్రమం



జనగామ, మన ప్రజాపక్షం:
జనగామ జిల్లా కేంద్రంలోని బీరప్పగడ్డలో మహారాణి దుర్గా మాయ ఆధ్వర్యంలో కళావృత్తి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జనగామ మున్సిపల్ చైర్ పర్సన్ కడకంచి బాలమణి శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా కమిటీ సభ్యులు ముఖ్య అతిథికి శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. అనంతరం రాజేశ్వరాచారి అయ్యవార్లతో మంత్రోచ్ఛారణ చేయిస్తూ సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికి ఆశీర్వాదాలు అందజేశారు.ఈ సందర్భంగా ముఖ్య అతిథి కడకంచి బాలమణి శ్రీనివాస్ మాట్లాడుతూ కళలు, సంప్రదాయాలను పరిరక్షిస్తూ కళాకారులను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. ఇటువంటి కార్యక్రమాలు ప్రజల్లో సాంస్కృతిక చైతన్యాన్ని పెంపొందించడంతో పాటు మన సంప్రదాయాలను భావితరాలకు అందించేందుకు దోహదపడతాయని పేర్కొన్నారు.కళాకారులను తీర్చిదిద్దడంలో గురువుల పాత్ర ఎంతో కీలకమని నిర్వాహకులు పేర్కొన్నారు. ప్రత్యేకంగా మైత్రేయ కూచిపూడి కళా క్షేత్రం గురువు సుకేష్ అందిస్తున్న శిక్షణ, కళాకారుల ప్రతిభను వెలికితీసేందుకు చేస్తున్న కృషిని అభినందించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు, స్థానికులు, కళాకారులు, నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.



అర్హులందరికీ డిజిటల్ స్మార్ట్ రేషన్ కార్డులు: సర్పంచ్ ర్యాకల సంతోష శ్రీనివాస్

తాజ్‌పూర్ గ్రామపంచాయతీలో లబ్ధిదారులకు కార్డుల పంపిణీ

యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి : భువనగిరి మండలం తాజ్‌పూర్ గ్రామపంచాయతీ కార్యాలయంలో శనివారం ఆహార భద్రత కార్డుల లబ్ధిదారులకు డిజిటల్ స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం ఘనంగా జరిగింది. గ్రామ సర్పంచ్ ర్యాకల సంతోష శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై అర్హులైన లబ్ధిదారులకు స్వయంగా స్మార్ట్ కార్డులను అందజేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. ప్రభుత్వ సంక్షేమ ఫలాలు గ్రామంలోని ప్రతి పేద కుటుంబానికి అందాలన్నదే తమ లక్ష్యమని పేర్కొన్నారు. గ్రామంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ విడతల వారీగా స్మార్ట్ రేషన్ కార్డులు అందజేస్తామని హామీ ఇచ్చారు. ఇంకా రేషన్ కార్డులు లేని అర్హులు కొత్త కార్డుల కోసం దరఖాస్తు చేసుకోవాలని, కార్డుల జారీలో ఎలాంటి సమస్యలు ఉన్నా నేరుగా గ్రామపంచాయతీ కార్యాలయం దృష్టికి తీసుకురావాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ప్రముఖ సామాజికవేత్త డాక్టర్ ర్యాకల శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి నర్సింగ్‌రావు, ఉపసర్పంచ్ వరిగంటి కృష్ణ, వార్డు సభ్యులు, రేషన్ డీలర్, మాజీ సర్పంచ్‌లు, గ్రామ పెద్దలు మరియు లబ్ధిదారులు పాల్గొన్నారు.

శ్రీ శ్రీనివాస జ్యోతిష్యాలయంలో ఘనంగా దేవి నవరాత్రులు

ఏడో రోజు శ్రీ మహాలక్ష్మి అవతారంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు

ఓల్డ్ బోయిన్‌పల్లి, అక్టోబర్ 17



కూకట్‌పల్లి నియోజకవర్గం బాలానగర్ మండలం ఓల్డ్ బోయిన్‌పల్లి మల్లికార్జున కాలనీ, రోడ్ నంబర్ 3లోని శ్రీ శ్రీనివాస జ్యోతిష్యాలయంలో శ్రీ నివర్తి భరద్వాజ శర్మ ఆధ్వర్యంలో దేవి నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో, మంత్రోచ్ఛారణల మధ్య ఘనంగా నిర్వహిస్తున్నారు. అక్టోబర్ 17న ఏడో రోజు అమ్మవారు శ్రీ మహాలక్ష్మి దేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చి ప్రత్యేక పూజలు అందుకున్నారు.నవరాత్రుల సందర్భంగా ప్రతిరోజూ ఉదయం శ్రీ సూక్త హోమం, పూర్ణాహుతి, సాయంత్రం చండీ పారాయణం నిర్వహిస్తున్నట్లు శ్రీ నివర్తి భరద్వాజ శర్మ తెలిపారు. అక్టోబర్ 18న దుర్గాష్టమి సందర్భంగా ప్రత్యేకంగా చండీ హోమ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వెల్లడించారు.



అక్రమ వెంచర్, ఫామ్ ల్యాండ్ వ్యవహారంపై సమగ్ర విచారణ జరపాలి

బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి..

బాధితులకు న్యాయం చేయాలి

అక్టోబర్ 17 (నారాయణఖేడ్):

అక్రమ వెంచర్, ఫామ్ ల్యాండ్ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ అలిగే జీవన్ నిరాహారదీక్షకు సిద్ధమయ్యారు. ఈ నెల 22న నారాయణఖేడ్‌లోని అంబేద్కర్ చౌక్ వద్ద నిరాహారదీక్ష చేపట్టనున్నట్లు ప్రకటించారు.శనివారం అంబేద్కర్ భవనం వద్ద నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఫామ్ ల్యాండ్ వ్యవహారంలో చోటుచేసుకున్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న అక్రమాలపై సంబంధిత అధికారులు సమగ్ర విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించినట్లు విచారణలో తేలితే సంబంధిత యాజమాన్యంపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.బాధితులకు న్యాయం జరిగేలా అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని, సమస్య పరిష్కారమయ్యే వరకు తమ పోరాటాన్ని కొనసాగిస్తామని అలిగే జీవన్ స్పష్టం చేశారు. నిరాహారదీక్ష ద్వారా ఈ వ్యవహారాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లి, బాధితులకు న్యాయం జరిగేలా కృషి చేస్తామని తెలిపారు.

ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఘనంగా బతుకమ్మ సంబరాలు

మహిళలతో కలిసి బతుకమ్మ ఆడిన ఎమ్మెల్యే పల్లా సతీమణి నీలిమ

వేడుకల్లో పాల్గొన్న మాజీ మంత్రి ఎర్రబెల్లి,ఎమ్మెల్యే పల్లా

జనగామ, మన ప్రజాపక్షం:
తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను పురస్కరించుకొని జనగామ జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో జనగామ ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వ ర్‌రెడ్డి సతీమణి నీలిమ మహిళా ప్రజాప్రతినిధులతో కలిసి బతుకమ్మ ఆడారు. ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు వేడుకల్లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా క్యాంపు కార్యాలయ ప్రాంగణంలో నియోజకవర్గానికి చెందిన మహిళా ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. మహిళలు రంగురంగుల పూలతో బతు కమ్మలను అందంగా పేర్చి, సంప్రదాయబద్ధంగా ఆటపాటలతో సంబ రాలు జరుపుకున్నారు. ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి సతీమణి నీలిమ మహిళలతో కలిసి బతుకమ్మ ఆడుతూ వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా మాజీ మంత్రి దయాకర్, ఎమ్మెల్యే పల్లా మాట్లాడుతూ బతుకమ్మ పండుగ తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ఐక్యతకు, సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని పేర్కొ న్నారు. పూలతో బతుకమ్మలను పేర్చి, ఆటపాటలతో జరుపుకునే ఈ పండుగ తెలంగాణ ప్రజల జీవన విధానంలో



ప్రత్యేక స్థానాన్ని కలిగి ఉందన్నారు. తరతరాలుగా వస్తున్న సంప్రదాయాలను భావితరాలకు అందించడంతో పాటు, మహిళల మధ్య ఆత్మీయతను పెంపొందిం చడంలో బతుకమ్మ వేడుకలు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు.

తెలంగాణ ఆడపడుచుల ఆత్మగౌరవ ప్రతీక - సద్దుల బతుకమ్మ

మన ప్రజాపక్షం డెస్క్:
తెలంగాణ సంస్కృతికి, ఆత్మగౌరవానికి ప్రతీక అయిన పండుగలలో బతుకమ్మ పండుగ అత్యంత ప్రధానమైనది. ఇది ప్రకృతిని, పూలను, నీటిని ఆరాధించే అద్భుతమైన పూల పండుగ. తొమ్మిది రోజుల పాటు సాగే ఈ వేడుకలలో ఆఖరి రోజైన సద్దుల బతుకమ్మ (దుర్గాష్టమి రోజు) అత్యంత వైభవంగా, ఉత్సాహంగా జరుగుతుంది. ఈ రోజుతో బతుకమ్మ సంబురాలు ముగుస్తాయి, అందుకే దీనికి అంత ప్రత్యేకత ఉంది.

పూల అమరిక - సద్దుల ప్రత్యేకత
సద్దుల బతుకమ్మ రోజున మహిళలు తెల్లవారుజాము నుంచే ఉత్సాహంగా పూల సేకరణకు పూనుకుంటారు. గునుగు, తంగేడు, బంతి, చామంతి, గుమ్మడి వంటి వివిధ రకాల రంగురంగుల అడవి పూలతో గౌరమ్మను కొలువుదీరుస్తారు. అడుగుల కొద్దీ ఎత్తులో, తామర పువ్వు ఆకారంలో రకరకాల అంచెలుగా బతుకమ్మను ఎంతో కళాత్మకంగా పేర్చుతారు. ఇక ఈ రోజు ప్రత్యేకత ఏమిటంటే, బతుకమ్మతో పాటు వివిధ రకాల పిండి వంటలు (సద్దులు) అనగా నువ్వుల పొడి, పల్లీల పొడి, కొబ్బరి పొడి, బెల్లం కలిపిన అన్నం నైవేద్యంగా తయారు చేస్తారు. అందుకే ఈ రోజును 'సద్దుల బతుకమ్మ' అని పిలుస్తారు.

సాంస్కృతిక వైభవం - కోలాటాలు, బతుకమ్మ పాటలు
సాయంత్రం కాగానే ఊరందరూ ఒకచోట చేరి బతుకమ్మను గ్రామంలోని కూడళ్లలోకి లేదా చెరువు కట్టల వద్దకు ఊరేగింపుగా తీసుకెళ్తారు. కొత్త బట్టలు ధరించిన



ఆడపడుచులు, యువతులు బతుకమ్మ చుట్టూ వలయాకారంలో తిరుగుతూ చప్పట్లు కొడుతూ, లయబద్ధంగా అడుగులు వేస్తూ పాడే పాటలు హృదయాలను హత్తుకుంటాయి. గౌరమ్మ కీర్తనలు, తెలంగాణ చారిత్రక నేపథ్యం, కష్టసుఖాలను ప్రతిబింబించే పాటలతో ఆ ప్రాంతమంతా హోరెత్తుతుంది. కోలాటాలు, ఆటపాటలతో ఆ ప్రాంతం ఒక బృహత్ ఉత్సవ ప్రాంగణాన్ని తలపిస్తుంది.

జలాశయాలలో నిమజ్జనం - వీడ్కోలు ఘట్టం
రాత్రి వేళలో ఆటలు ముగిసిన తర్వాత, భక్తిశ్రద్ధలతో పేర్చిన బతుకమ్మలను సమీపంలోని చెరువులు, కుంటలు లేదా నదుల వద్దకు చేర్చుతారు. నీటిలో దిగి దీపాలు వెలిగించి, బతుకమ్మలను నీటిలో నిమజ్జనం చేస్తారు. ఆ తర్వాత తాము తెచ్చిన సద్దుల (నైవేద్యాలను) బంధుమిత్రులకు, ఇరుగుపొరుగు వారికి పంచిపెట్టి ఆప్యాయతలు పంచుకుంటారు. "ఉయ్యాలో... ఉయ్యాలో..." అంటూ సాగే ఆ వీడ్కోలు ఘట్టం మహిళల కళ్లలో ఆనందభాష్పాలను తెప్పిస్తుంది.

ప్రకృతితో మానవ సంబంధం
?సద్దుల బతుకమ్మ కేవలం ఒక పండుగ మాత్రమే కాదు, అది తెలంగాణ ఆడబిడ్డల ఆత్మగౌరవ ప్రతీక మరియు పర్యావరణ పరిరక్షణకు అద్దం పట్టే వేడుక. చెరువులు నిండి కళకళలాడాలని, పంటలు బాగా పండాలని కోరుకుంటూ ప్రకృతిని తల్లిగా పూజించే ఈ అద్భుత సాంప్రదాయం మన ఐక్యతను, సంస్కృతిని ప్రపంచానికి చాటుతుంది. వచ్చే ఏడాది మళ్లీ రావాలంటూ గౌరమ్మకు వీడ్కోలు పలుకుతూ తెలుగు లోగిళ్లలో సద్దుల బతుకమ్మ వేడుకలు ముగుస్తాయి.

-మీ ఈగం సోమేశ్, స్టేట్ కో ఆర్డినేటర్,
మన ప్రజాపక్షం దినపత్రిక

వ్యాపార సముదాయాల్లో పార్కింగ్ తప్పనిసరి

రోడ్లపై పశువులు వదిలితే యజమానులకు జరిమానా

ఇసుక అక్రమ రవాణాపై ఉక్కుపాదం..వీడీసీల ఇసుక వేలం సహించేది లేదు

భూభారతి,ప్రజావాణి దరఖాస్తులను వేగంగా పరిష్కరించాలి

జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా,ఎస్పీ జానకి షర్మిల

నిర్మల్,మన ప్రజాపక్షం:
పట్టణ ప్రాంతాల్లో పెరుగుతున్న ట్రాఫిక్, పార్కింగ్ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేలా అధికారులు సమన్వయంతో చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా ఆదేశించారు. వ్యాపార సముదాయాలకు తప్పనిసరిగా పార్కింగ్ సదుపాయం ఉండేలా చూడాలని స్పష్టం చేశారు.శనివారం కలెక్టరేట్‌లో ఎస్పీ జానకి షర్మిలతో కలిసి వివిధ శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణాల్లో ట్రాఫిక్ నియంత్రణ, రోడ్లపై ఆక్రమణలు, పశువుల సంచారం, ఇసుక అక్రమ రవాణా తదితర అంశాలపై అధికారులతో చర్చించారు.పార్కింగ్ సదుపాయం లేకుండా, నిబంధనలకు విరుద్ధంగా వ్యాపార కార్యకలాపాలు నిర్వహిస్తూ ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించే వ్యాపార సముదాయాలను గుర్తించి నోటీసులు జారీ చేయాలని కలెక్టర్ సూచించారు. నిబంధనలు పాటించని వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రధాన రహదారులపై పశు వులను వదిలే యజమానులపై కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. పశువుల కారణంగా ప్రమాదాలు, ట్రాఫిక్ అంతరాయాలు ఏర్పడకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘించే యజమానులకు



జరిమానాలు విధించడంతో పాటు అవసరమైతే పశువులను స్వాధీనం చేసుకోవాలని స్పష్టం చేశారు. జాతీయ రహదారులు, మున్సిపల్ పరిధిలోని ప్రధాన రహదారులపై ఉన్న ఆక్రమణలను గుర్తించి తొలగించాలని అధికారులను ఆదేశించారు. తరచూ ప్రమాదాలు జరిగే ప్రాంతాలను 'బ్లాక్ స్పాట్లు'గా గుర్తించి క్షేత్రస్థాయిలో పరిశీలించాలని సూచించారు. ప్రమాదాల నివారణకు అవసరమైన హెచ్చరిక బోర్డులు, ఇతర భద్రతా చర్యలు చేపట్టాలని తెలిపారు.జాతీయ రహదారుల వెంట నిబంధనలకు విరుద్ధంగా, ప్రమాదకరంగా భారీ వాహనాలను నిలిపే వారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లాలో ఇసుక అక్రమ రవాణాను పూర్తిస్థాయిలో అరికట్టేందుకు పటిష్ట నిఘా ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రభుత్వ శాఖల నిర్మాణ పనులకు కూడా నిబంధనలకు అనుగుణంగానే ఇసుకను వినియోగించాలని స్పష్టం చేశారు. గ్రామాల్లో నిబంధనలకు విరుద్ధంగా విలేజ్ డెవలప్‌మెంట్ కమిటీలు (వీడీసీ) ఇసుక వేలం నిర్వహిస్తే సహించేది లేదని కలెక్టర్ హెచ్చరించారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వీడీసీలపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

డ్రగ్స్ రహిత జిల్లాగా తీర్చిదిద్దుతాం...ఎస్పీ
జిల్లాను మాదకద్రవ్యాల రహితంగా తీర్చిదిద్దేందుకు పటిష్ట చర్యలు చేపడుతున్నామని ఎస్పీ జానకి షర్మిల తెలిపారు. పట్టణాల్లో ట్రాఫిక్



సమస్యల పరిష్కారానికి పోలీసు శాఖ తరపున అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. వివిధ కేసుల్లో బాధితులకు అందాల్సిన నష్టపరిహారాన్ని త్వరితగతిన అందించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ వేధింపుల నిరోధక చట్టం కింద నమోదైన కేసుల దర్యాప్తును వేగవంతం చేస్తున్నామని వెల్లడించారు. వ్యవసాయ, ఎక్సైజ్ శాఖల సమన్వయంతో గంజాయి సాగు, విక్రయాలను అరికడుతున్నామని,మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలపై ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నామని ఎస్పీ తెలిపారు. అనంతరం సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించే ప్రత్యేక పోస్టర్‌ను అధికారులు ఆవిష్కరించారు. అనంతరం రెవెన్యూ అధికారులతో కలెక్టర్ ప్రత్యేకంగా సమావేశమయ్యారు. భూభారతి,సీఎం ప్రజావాణిలో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిశీలించి నిర్ణీత సమయంలో పరిష్కరించాలని ఆదేశించారు. భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేలా భూముల రీ-సర్వే ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు రాథోడ్ రమేష్, వెంకట మాధవ రావు, ఏఎస్పీలు సాయి కిరణ్, ఉపేంద్రా రెడ్డి, ఖైసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్ సంబంధిత శాఖల అధికారులు, తహశీల్దార్లు, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఘనంగా బతుకమ్మ వేడుకలు

నిర్మల్,మన ప్రజాపక్షం:జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో పట్టణంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో శనివారం రాత్రి బతుకమ్మ వేడుకలు కన్నుల పండుగగా వైభవంగా జరిగాయి.ఈ వేడుకల్లో జిల్లా అదనపు కలెక్టర్లు రాథోడ్ రమేష్, వెంకట మాధవ రావు, నిర్మల్ శాసనసభ్యులు ఏలేటి మహేశ్వర్ రెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ అప్పాల కావ్య, ఇతర అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో భాగంగా నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ పూలను పూజించే గొప్ప సంస్కృతి మనదని అన్నారు. మన సంస్కృతి, సాంప్రదాయాలను కాపాడుతూ బతుకమ్మ పండుగను భక్తితో జరుపుకోవాలని అన్నారు. జిల్లా ప్రజలందరికీ దసరా, బతుకమ్మ పండుగ శు భాకాంక్షలు తెలియజేశారు.మున్సిపల్ చైర్ పర్సన్ అప్పాల కావ్య మాట్లాడుతూ మన సంస్కృతి సాంప్రదాయాలను భావితరాలకు అందించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు.





భక్తిశ్రద్ధలతో మన సంస్కృతి సాంప్రదాయాలను కాపాడుతూ బతుకమ్మ పండుగను నిర్వహించుకోవాలని తెలిపారు.బతుకమ్మకు పూజలు చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అదనపు కలెక్టర్లు, ప్రజా ప్రతినిధులు ఉత్సాహంగా మహిళలతో కలిసి బతుకమ్మ ఆడారు.ఈ బతుకమ్మ వేడుకల్లో మున్సిపల్ వైస్ చైర్మన్ అప్పాల గణేష్ చక్రవర్తి, డిఆర్డిఓ విజయలక్ష్మి, డిడబ్ల్యుఓ వినూత్న, డిపిఆర్ఓ విష్ణువర్ధన్, డిఎఐఓ శ్రీకాంత్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ రవిబాబు, ప్రజా ప్రతినిధులు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పేట కలెక్టరేట్‌లో అంబరాన్నంటిన బతుకమ్మ సంబరాలు

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు బతుకమ్మ పండుగ ప్రతీక

జిల్లా కలెక్టర్ సిహెచ్.ప్రియాంక





నారాయణపేట,మన ప్రజాపక్షం:
పూల పండుగ బతుకమ్మ మహిళల ఐక్యతకు, ప్రకృతితో మానవ సంబంధానికి ప్రతిరూపం అని జిల్లా కలెక్టర్ ప్రియాంక పేర్కొన్నారు.నారాయణ పేట జిల్లా కలెక్టరేట్ ఆవరణలో శనివారం సాయంత్రం జిల్లా మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన బతుకమ్మ సంబరాలు అంబరాన్నంటాయి.రంగురంగుల పూలతో అందంగా అలంకరించిన బతుకమ్మలతో కలెక్టరేట్ ప్రాంగణం పూలవనంలా కనువిందు చేసింది. మహిళలు సంప్రదాయ దుస్తుల్లో పాల్గొని బతుకమ్మ పాటలు పాడుతూ, సంప్రదాయ నృత్యాలతో సందడి చేయడంతో కలెక్టరేట్ ఆవరణ పండుగ శోభను సంతరించుకుంది.ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రియాంక, అదనపు కలెక్టర్ శ్రీను, మున్సిపల్ చైర్ పర్సన్ కొండా శ్వేతా సత్య యాదవ్, వైస్ చైర్ పర్సన్ మంజుల, జిల్లా మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ అధికారి రాజేందర్ గౌడ్, కలెక్టరేట్ పరిపాలన అధికారి అనిల్ కుమార్, కలెక్టరేట్ ఉద్యోగులు, సిబ్బంది, మెప్మా సిబ్బంది, మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రియాంక మాట్లాడుతూ బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. ప్రకృతిని ఆరాధిస్తూ, పూలను పూజిస్తూ మహిళలు సామూహికంగా జరుపుకునే ఈ పండుగ మన సంస్కృతిలో ప్రత్యేక స్థానాన్ని కలిగి ఉందన్నారు. తెలంగాణ ఆడవడుచుల ఆత్మీయతకు, ఐక్యతకు, సృజనాత్మకతకు బతుకమ్మ పండుగ అద్దం పడుతుందని తెలిపారు.బతుకమ్మ పండుగలో ప్రకృతికి, పూలకు ఇచ్చే ప్రాధాన్యత ఎంతో గొప్పదని కలెక్టర్ పేర్కొన్నారు. వివిధ రకాల పూలను సేకరించి అందంగా బతుకమ్మలను పేర్చడం మన సంప్రదాయంలోని కళాత్మకతను ప్రతిబింబిస్తుందని తెలిపారు. ప్రకృతిలో లభించే పూలను పూజించడం ద్వారా పర్యావరణంపై గౌరవం, ప్రకృతి పరిరక్షణ పట్ల అవగాహన పెంపొందుతాయని అన్నారు. తరతరాలుగా కొనసాగుతున్న ఈ పండుగ మన సాంస్కృతిక వారసత్వాన్ని భావితరాలకు అందించే గొప్ప వేదికగా నిలుస్తుందని పేర్కొన్నారు. బతుకమ్మ పండుగ మహిళలందరినీ ఒకే వేదికపైకి తీసుకువచ్చి ఆనందాన్ని, ఆత్మీయతను పంచుతుందని కలెక్టర్ అన్నారు. కుటుంబాలు, సమాజం సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షిస్తూ మహిళలు జరుపుకునే ఈ పండుగలో సామూహిక భాగస్వామ్యం ప్రత్యేకతగా నిలుస్తుందని తెలిపారు. మహిళలు తమ సంస్కృతి, సంప్రదాయాలను గౌరవిస్తూ వాటిని భావితరాలకు పరిచయం చేయాలని సూచించారు.ప్రభుత్వ కార్యాలయాల్లో కూడా ఇలాంటి సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించడం ద్వారా ఉద్యోగుల మధ్య ఐక్యత, సౌహార్ద వాతావరణం మరింత బలోపేతం అవుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. విధి నిర్వహణతో పాటు మన పండుగలు, సంప్రదాయాలకు తగిన ప్రాధాన్యత ఇవ్వడం మనందరి బాధ్యత అని తెలిపారు.అనంతరం మహిళలు సంప్రదాయ బతుకమ్మ పాటలు ఆలపిస్తూ, బతుకమ్మల చుట్టూ వలయాకారంలో తిరుగుతూ నృత్యాలు చేశారు. రంగురంగుల పూలతో అలంకరించిన బతుకమ్మలు, మహిళల కోలాటాలు, పాటలతో కలెక్టరేట్ ప్రాంగణం సందడిగా మారింది. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల వైభవాన్ని చాటుతూ నిర్వహించిన ఈ వేడుకలు ఉత్సాహభరిత వాతావరణంలో కొనసాగాయి.జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన బతుకమ్మ సంబరాలు ఉద్యోగులు, మహిళా సిబ్బందిలో పండుగ ఉత్సాహాన్ని నింపాయి. సంప్రదాయాల పరిరక్షణ, మహిళల భాగస్వామ్యం, సాంస్కృతిక ఐక్యతకు ఈ వేడుకలు ప్రతీకగా నిలిచాయి.

చురుకుగా పోలీసు అమరవీరుల స్థూపం పనులు..



- జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయం ముందు నిర్మాణం
- పోలీసు అమరవీరుల వారోత్సవాల సందర్భంగా ఆవిష్కరణ
- ప్రత్యేక ఆకర్షణగా 'సాయుధ బలగాల రవాణా వాహనం'

నాగర్ కర్నూల్,మన ప్రజాపక్షం:
నాగర్ కర్నూల్ జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయం ముందు ఏర్పాటు చేస్తున్న పోలీసు అమరవీరుల స్థూపం పనులు చురుకుగా కొనసాగుతున్నాయి. అక్టోబర్ 21 నుండి దాదాపు పది రోజుల పాటు నిర్వహించే పోలీసు అమరవీరుల వారోత్సవాల సందర్భంగా ఈ 'పోలీసు అమరవీరుల' స్థూపాన్ని ఆవిష్కరించనున్నారు. అమర వీరుల స్థూపంతో పాటు భారత సైన్యం మరియు సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ (సిఆర్ పిఎఫ్) ఉపయోగించే మైన్ ప్రొటెక్టెడ్ వెహికల్ (ఎంపీవి-మైన్ ప్రొటెక్టెడ్ వెహికిల్) ప్రత్యేక ఆకర్షణగా నిలువనుంది. దీనిని ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ బోర్డ్ (ఓఎఫ్బి)కి చెందిన వెహికల్ ఫ్యాక్టరీ జబల్‌పూర్ (విఎఫ్ జె) మరియు ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ మేదక్ కలిసి సంయుక్తంగా అభివృద్ధి చేశాయి. దీని మొదటి వెర్షన్‌ను 'ఆదిత్య' అని పిలుస్తారు.ఈ వాహనం యొక్క లక్ష్యం:జమ్మూ కాశ్మీర్ మరియు నక్సలైట్ ప్రభావిత ప్రాంతాలలో (ఛత్తీస్‌గఢ్, తెలంగాణ సరిహద్దులు వంటి చోట్ల) ఉగ్రవాదులు లేదా మావోయిస్టులు ల్యాండ్ మైన్లు (గనుల పేలుళ్లు) లేదా ఐఈడీ బాంబులతో దాడి చేసినప్పుడు సైనికులకు పూర్తి రక్షణ కల్పించడానికి దీనిని రూపొందించారు.
బాంబు ప్రూఫ్ నిర్మాణం: ఈ వాహనం కింది భాగం (హల్) 'వి'ఆకారపు ఉక్కు కవచంతో నిర్మించబడింది. దీనివల్ల కింద బాంబు పేలినప్పుడు ఆ పేలుడు తీవ్రత పక్కకు మళ్లింపబడి, లోపల ఉన్న సైనికులకు ఎలాంటి ప్రాణనష్టం జరగదు.
బుల్లెట్ ప్రూఫ్ రక్షణ: వాహనం చుట్టూ అమర్చిన దట్టమైన స్టీల్ ప్లేట్లు మరియు బుల్లెట్ ప్రూఫ్ గ్లాస్ ద్వారా 7.62ఎంఎం ఎస్ఎల్ఆర్, ఏకె-47 వంటి అత్యాధునిక తుపాకుల బుల్లెట్ల దాడిని కూడా ఇది సులభంగా తట్టుకోగలదు.
ప్రతిఘటనా సదుపాయం:వాహనం లోపల కూర్చున్న సైనికులు సురక్షితంగా ఉంటూనే బయట ఉన్న శత్రువులపై ఎదురుదాడి చేయడానికి వీలుగా బుల్లెట్ ప్రూఫ్ అద్దాల కింద ప్రత్యేక రంధ్రాలు అమర్చబడ్డాయి.
పైభాగంలో గన్ టరెట్: వాహనం టాప్ రూఫ్‌పై 360 డిగ్రీలు తిరిగే మెషిన్ గన్ (ఎల్ఎంజి/ఎంఎంజి) లేదా రిమోట్ కంట్రోల్డ్ వెపన్ స్టేషన్‌ను అమర్చుకునే సదుపాయం ఉంది. అలాగే ఈ మైన్-రెసిస్టెంట్ ఆంబుష్ ప్రొటెక్టెడ్ వాహనం ఒకసారి ఫుల్ ట్యాంక్ చేస్తే దాదాపు 1,000 కిలోమీటర్లు ప్రయాణించగలదు. గరిష్ట వేగం గంటకు 80-85 కిలోమీటర్లు సామర్థ్యం ఉంటుంది. ఇద్దరు సిబ్బంది మరియు 10 నుండి 12 మంది సాయుధ సైనికులు ప్రయాణించవచ్చు.ఈ వాహనానికి ఇందనంగా డీజిల్ వాడతారు.రక్షణ స్థాయి చక్రాల కింద 14 కేజీల వరకు, వాహనం కింద 10 కేజీల వరకు 'టి ఎన్ టి 'పేలుళ్లను తట్టుకోగలదు. అయితే ఇలాంటి ప్రత్యేకమైన వాహనాన్ని కూడా 'పోలీసు అమరవీరుల స్థూపం' వద్ద ఏర్పాటు చేయడం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

అల్వాల్‌లో పట్టభద్రుల ఓటరు నమోదు ప్రత్యేక కార్యక్రమం

గోగూరి శ్రీధర్ రెడ్డి ఆధ్వర్యంలో నమోదు డ్రైవ్



అక్టోబర్ 17
(ఖానాజిగూడ):
వరంగల్-ఖమ్మం-నల్గొండ, హైదరాబాద్-రంగారెడ్డి-మహబూబ్‌నగర్ పట్టభద్రుల శాసనమండలి ఎన్నికల నేపథ్యంలో భారతీయ జనతా పార్టీ 195-ఖానాజిగూడ డివిజన్ అధ్యక్షుడు గోగూరి శ్రీధర్ రెడ్డి ఆధ్వర్యంలో శోభా గార్డెన్స్‌లో ప్రత్యేక పట్టభద్రుల ఓటరు నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో డివిజన్ పరిధిలోని పలువురు పట్టభద్రులు తమ పేర్లను ఓటర్లుగా నమోదు చేసుకున్నారు. ఈ సందర్భంగా గోగూరి శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో విద్యావంతుల పాత్ర కీలకమని, అర్హులైన ప్రతి పట్టభద్రుడు ఓటరుగా నమోదు చేసుకొని తన ఓటు హక్కును వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. డివిజన్ పరిధిలోని అర్హులందరినీ ఓటర్లుగా నమోదు చేయించేందుకు పార్టీ కార్యకర్తలు సమన్వయంతో కృషి చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో డివిజన్ ఎన్‌రోల్‌మెంట్ కన్వీనర్ శ్రీధర్, సందీప్, ఎస్సీ మోర్చా జిల్లా మాజీ అధ్యక్షుడు మురళీకృష్ణ, డివిజన్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయంలో భవాని అలంకరణ.. ఎమ్మెల్యే శ్రీగణేష్ ప్రత్యేక పూజలు

కుమ్మరిగూడలో శరన్నవరాత్రి ఉత్సవాల్లో పాల్గొన్న కంటోన్మెంట్ ఎమ్మెల్యే



అక్టోబర్ 17
(కుమ్మరిగూడ):
సికింద్రాబాద్ కంటోన్మెంట్ నియోజకవర్గం కుమ్మరిగూడలోని శ్రీ శ్రీ శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి దేవాలయంలో నిర్వహిస్తున్న శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఏడో రోజు నిర్వహించిన భవాని అలంకరణలో కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, కంటోన్మెంట్ ప్రాంతం సుభిక్షంగా అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. భక్తిశ్రద్ధలతో నిర్వహించే శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రజల్లో ఆధ్యాత్మిక భావనను, భక్తిభావాన్ని మరింత పెంపొందిస్తాయని పేర్కొన్నారు.



ఘనంగా ఎస్సీ, ఎస్టీ విద్యుత్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు రవీందర్ జన్మదిన వేడుకలు

కేక్ కట్ చేయించి, శాలువాతో సత్కరించిన నాయకులు

ముఖ్య అతిథిగా పాల్గొన్న భువనగిరి డీఈ సంగం వెంకటేశ్వర్లు

అక్టోబర్ 17,
యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి : యాదాద్రి భువనగిరి జిల్లా, ఎస్సీ, ఎస్టీ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఎం.ఆర్. రవీందర్ జన్మదిన వేడుకలను భువనగిరి డివిజన్ కార్యాలయ ప్రాంగణంలో ఘనంగా నిర్వహించారు. ?అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జాతీయ అవార్డు గ్రహీత బొట్ల రాజేశ్వర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో రవీందర్‌తో కేక్ కట్ చేయించారు. అనంతరం ఆయనకు పూలమాలలు వేసి, శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన భువనగిరి డీఈ సంగం వెంకటేశ్వర్లు, రవీందర్‌కు ప్రత్యేక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి రవీందర్ చేస్తున్న కృషిని ఈ సందర్భంగా పలువురు కొనియాడారు.ఈ

చీకటి, తొక్కిసలాట, ఓ ప్రకటన.. కోల్‌కతాలో మృత్యుఘోష జరిగింది ఇదే!

ఆనందోత్సాహాలతో వెలిగిపోవాల్సిన పండగ పందిరి... ఆర్తనాదాలతో నిండిపోయింది. భక్తి పారవశ్యంతో మార్మోగాల్సిన ప్రాంగణం.. మృత్యుఘోషతో దద్దరిల్లింది. పశ్చిమ బెంగాల్ రాజధాని కోల్‌కతా నగరాన్ని పెను విషాదం కమ్మేసింది. పవిత్ర దుర్గా నవరాత్రుల్లో భాగంగా సప్తమి రోజున, ఉత్తర కోల్‌కతాలోని చోర్‌బాగన్ సర్బోజనిన్ పూజా పందిరిలో జరిగిన తొక్కిసలాటలో 13 మంది మహిళలు, ఒక చిన్నారి సహా 19 మంది భక్తులు అసువులు బాశారు. మరో 25 మందికి పైగా తీవ్ర గాయాలతో ఆసుపత్రి పాలయ్యారు.

అసలేం జరిగింది?.. క్షణాల్లో మారిన దృశ్యం

శనివారం సాయంత్రం. పండగ శోభతో చోర్‌బాగన్‌లోని సారదా పార్క్ పరిసరాలు కిటకిటలాడుతున్నాయి. అమ్మవారి దర్శనం కోసం వేలాదిగా భక్తులు పందిరి వద్ద బారులు తీరారు. సాయంత్రం 7:40 గంటల ప్రాంతంలో వాతావరణం ఒక్కసారిగా మారింది. ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం మొదలైంది. బయట క్యూలలో వేచి ఉన్న వందలాది మంది భక్తులు వర్షం నుంచి తలదాచుకోవడానికి ఒకేసారి పందిరి లోపలికి దూసుకొచ్చే ప్రయత్నం చేశారు.అదే సమయంలో, "వర్షం వస్తోంది, లోపలికి రండి" అంటూ నిర్వాహకులు చేసిన ఓ ప్రకటన పరిస్థితిని మరింత తీవ్రతరం చేసింది. పందిరి ప్రవేశ, నిష్క్రమణ మార్గాలు అత్యంత ఇరుకుగా ఉండటం, లోపల సరైన వెలుతురు లేకపోవడంతో పెను విషాదం చోటుచేసుకుంది. ముందున్న వారు అదుపుతప్పి కిందపడిపోయారు. వెనుక నుంచి వెల్లువెత్తిన జన ప్రవాహం కిందపడిన వారిని గమనించకుండానే వారిపై నుంచే ముందుకు సాగింది. చీకటిలో ఏం జరుగుతుందో తెలుసుకునేలోపే, ఊపిరాడక, బరువైన ఒత్తిడికి తట్టుకోలేక 17 మంది అక్కడికక్కడే ప్రాణాలు విడిచారు. మరో ఇద్దరు ఆసుపత్రికి తరలిస్తుండగా మృతి చెందారు

కళ్లముందే భద్రతా వైఫల్యం.

ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం, ప్రమాద సమయంలో పందిరిలో ఏసీలు పనిచేయకపోవడంతో తీవ్రమైన ఉక్కపోత నెలకొంది. కనీస సంఖ్యలో వాలంటీర్లు, పోలీసు సిబ్బంది లేకపోవడం, జన నియంత్రణకు ఎలాంటి ముందస్తు ప్రణాళికలు లేకపోవడం ఈ ఘోరానికి ప్రధాన కారణాలని బాధితులు ఆరోపిస్తున్నారు. "ఒకరిపై ఒకరు పడుతూ నరకయాతన అనుభవించారు. మా కళ్ల ముందే ఎంతోమంది ఊపిరి వదిలారు" అంటూ ఓ ప్రత్యక్ష సాక్షి కన్నీటిపర్యంతమయ్యారు.



ప్రభుత్వ స్పందన, తక్షణ చర్యలు

ఈ దుర్ఘటనపై యావత్ దేశం దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం వెంటనే రంగంలోకి దిగింది. ఘటనకు బాధ్యులుగా భావిస్తున్న 12 మంది నిర్వాహకులు, వాలంటీర్లను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కలకత్తా హైకోర్టు న్యాయమూర్తి నేతృత్వంలో ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) విచారణకు ముఖ్యమంత్రి సువేందు అధికారి ఆదేశించారు. మృతుల కుటుంబాలకు రూ. 25 లక్షల పరిహారం, కుటుంబంలో ఒకరికి గ్రూప్-డి ప్రభుత్వ ఉద్యోగం ప్రకటించారు. గాయపడిన వారికి రూ. 5 లక్షల ఆర్థిక సాయంతో పాటు పూర్తి వైద్య ఖర్చులు ప్రభుత్వమే భరిస్తుందని హామీ ఇచ్చారు.ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఈ ఘటనపై తీవ్ర విచారం వ్యక్తం చేశారు. పీఎం సహాయ నిధి నుంచి మృతుల కుటుంబాలకు రూ. 2 లక్షలు, గాయపడిన వారికి రూ. 50,000 చొప్పున పరిహారం ప్రకటించారు.ఈ పెను విషాదం, దేశవ్యాప్తంగా పండగల సమయంలో భద్రతా ప్రమాణాల విషయంలో నిర్వాహకుల నిర్లక్ష్యానికి, జన నియంత్రణలో అధికారుల వైఫల్యానికి నిలువుటద్దం పడుతోంది.



మున్సిపల్ కార్మికుల వేతనాలు పెంచాలి

జీతాలు తగ్గించడం సరికాదు..

జీవో నంబర్ 1181ను రద్దు చేయాలి: చిరంజీవి

నారాయణఖేడ్, అక్టోబర్ 17 :
మున్సిపల్ కార్మికుల వేతనాలను పెంచాలని, ఇప్పటికే అందుతున్న జీతాలను తగ్గించడం సరైన పద్ధతి కాదని ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ సంగారెడ్డి జిల్లా కన్వీనర్ చిరంజీవి డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్మికుల వేతనాలకు సంబంధించిన జీవో నంబర్ 1181ను ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని కోరారు.పట్టణాల పరిశుభ్రత కోసం మున్సిపల్ కార్మికులు ప్రతిరోజూ కష్టపడి పనిచేస్తున్నారని, వారి వేతనాలను తగ్గిస్తే కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని చిరంజీవి పేర్కొన్నారు. కార్మికుల సమస్యలను గుర్తించి, వేతనాలు పెంచేలా ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.వేతనాలు పెంచడంతో పాటు జీవో నంబర్ 1181ను రద్దు చేయకపోతే కార్మికుల పక్షాన ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. కార్మికులకు న్యాయం జరిగే వరకు తమ పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ జిల్లా నాయకులు లక్ష్మణ్, సోయల్, రాములు తదితరులు పాల్గొన్నారు.

కొంపల్లిలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు

అమ్మవారిని దర్శించుకున్న ఎంపీ ఈటల

రాజేందర్, పెద్దబుద్ధుల సతీష్ సాగర్



అక్టోబర్ 17 (కొంపల్లి):
దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా కొంపల్లి డివిజన్ పరిధిలోని ఎస్సీఎల్ కాలనీలో ఏర్పాటు చేసిన అమ్మవారి మండపాన్ని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్‌తో కలిసి బీజేపీ కొంపల్లి డివిజన్ అధ్యక్షుడు పెద్దబుద్ధుల సతీష్ సాగర్ శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా వేద పండితుల ఆశీర్వాదం పొందారు.అనంతరం కొంపల్లి శివాలయ ప్రాంగణంలో కొలువుదీరిన అమ్మవారిని దర్శించుకుని అన్నప్రసాదం స్వీకరించారు.ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు శివాజీ రాజు, శంకర్ నాయక్, పేట్ బషీరాబాద్ డివిజన్ అధ్యక్షురాలు మాధురి, కొంపల్లి డివిజన్ నాయకులు ప్రకాష్ రావు, మధు, ఉప్పరి మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

కొలనుపాకలో శ్రీ దుర్గామాత ప్రత్యేక పూజలో పాల్గొన్న బొంకూరి మల్లయ్య దంపతులు




హైదరాబాద్ పల్స్ న్యూస్, అక్టోబర్ 17, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి : యాదాద్రి భువనగిరి జిల్లా, ఆలేరు మండలంలోని కొలనుపాక మెయిన్ రోడ్డు ఆవరణలో శ్రీ దుర్గామాత యూత్ ఆధ్వర్యంలో నెలకొల్పిన అమ్మవారి సన్నిధిలో శనివారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. వేదపండితులు పాండురంగ శాస్త్రి మంత్రోచ్ఛారణల మధ్య కమిటీ అధ్యక్షులు బొంకూరి మల్లయ్య – భాగ్యలక్ష్మి, కుర్మ సోమశేఖర్ – వాణి దంపతులు భక్తిశ్రద్ధలతో అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బొంకూరి మౌనిక – దుర్గాప్రసాద్, రుషిక, నివాన్స్, మల్లికార్జున్, సిద్ధార్థలతో పాటు కమిటీ సభ్యులు అబ్బగోని సుధాకర్, మిట్టపల్లి పాండు, ఎర్ర బాలరాజు, పార్వతి లింగమూర్తి, నలవాల మహేష్, చాడ ప్రశాంత్ రెడ్డి, జూకంటి శ్రీనివాస్, మడిపల్లి రమేష్, నీల మునిరాజ్, కోలా క్రాంతి కుమార్, కొంగరి వెంకటేష్, శ్రీరాముల కరుణాకర్, కూరపాటి సంపత్, చిరబోయిన అరవింద్, మామిడాల సురేష్, మడిపల్లి సురేష్, పొన్నబోయిన రవి, దూడల సాయిలు, నలవాల నరసింహులు, ఇమ్రాన్ మరియు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

అమీన్‌పూర్, బీరంగూడలో ఘనంగా దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు

ప్రత్యేక పూజల్లో పాల్గొన్న మాజీ మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి

అమీన్‌పూర్, అక్టోబర్ 17:
అమీన్‌పూర్, బీరంగూడ పరిధిలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా అమీన్‌పూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి శనివారం మారుతి హిల్స్, సృజన లక్ష్మీనగర్, జయలక్ష్మీనగర్, మంజీరానగర్, సాయి భగవాన్ కాలనీ, శ్రీరామ్ నగర్ కాలనీ, కిష్టారెడ్డిపేట్ గ్రామాల్లో ఏర్పాటు చేసిన దుర్గామాత మండపాలను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.వేద పండితుల సమక్షంలో అమ్మవారికి పూజలు చేసి తీర్థప్రసాదాలు సమర్పించారు. అనంతరం పలు ప్రాంతాల్లో నిర్వహించిన మహా అన్నదాన కార్యక్రమాల్లో పాల్గొని భక్తులకు స్వయంగా అన్నప్రసాదం వడ్డించారు.ఈ సందర్భంగా తుమ్మల పాండురంగారెడ్డి మాట్లాడుతూ, జగన్మాత ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని, ప్రతి ఒక్కరూ ఆయురారోగ్యాలు, సుఖశాంతులతో జీవించాలని ప్రార్థించినట్లు తెలిపారు. ఉత్సవాల చివరి రోజున నిర్వహించే అమ్మవారి నిమజ్జనోత్సవం, శోభాయాత్ర ఎలాంటి ఆటంకాలు లేకుండా ప్రశాంతంగా, వైభవంగా జరగాలని ఆకాంక్షించారు.కాలనీల వర్యటన సందర్భంగా ఉత్సవ కమిటీల నిర్వాహకులు, కాలనీవాసులు, ప్రజాప్రతినిధులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. వేద మంత్రోచ్ఛారణల మధ్య శాలువాలు కప్పి, పూలమాలలతో సన్మానించారు. అమ్మవారి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలను అందజేశారు.ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు, కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులు, స్థానిక నాయకులు, మహిళలు, యువకులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.





లక్ష్మీదేవిపల్లిని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దడమే లక్ష్యం

గ్రామాభివృద్ధికి ప్రాధాన్యం.. మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి

సర్పంచ్ గురగాళ్ల బంగారయ్య

అక్టోబర్ 17 (గోపాలపేట):
వనపర్తి జిల్లా గోపాలపేట మండలం లక్ష్మీదేవిపల్లి గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని సర్పంచ్ గురగాళ్ల బంగారయ్య తెలిపారు. గ్రామంలో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యమిస్తూ అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. పార్టీలకు అతీతంగా అందరినీ కలుపుకొని గ్రామాభివృద్ధికి కృషి చేస్తున్నట్లు చెప్పారు.

విద్యుత్ సమస్య పరిష్కారానికి చర్యలు
గ్రామంలో ఎన్నో ఏళ్లుగా ఉన్న విద్యుత్ సమస్యను పరిష్కరించేందుకు నూతన విద్యుత్ స్తంభాల ఏర్పాటు పనులు చేపట్టారు. గతంలో విద్యుత్ స్తంభాల కొరత, తక్కువ విద్యుత్ వోల్టేజీ కారణంగా రైతులు, కాలనీవాసులు ఇబ్బందులు ఎదుర్కొనేవారు. ప్రస్తుతం జేసీబీ, ట్రాక్టర్ సహాయంతో స్తంభాల ఏర్పాటు పనులు కొనసాగుతున్నాయి. ఈ పనులను సర్పంచ్ క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తున్నారు.

రోడ్ల విస్తరణ, పారిశుద్ధ్య పనులు
గ్రామంలోని ప్రధాన రహదారులకు ఇరువైపులా పెరిగిన పిచ్చి మొక్కలు, ముళ్ల పొదలు, మట్టి దిబ్బలను జేసీబీతో తొలగిస్తూ రహదారులను విస్తరిస్తున్నారు. దీంతో వాహనదారులు, పాఠశాలలకు వెళ్లే విద్యార్థులకు రాకపోకలు సులభతరం అవుతున్నాయని గ్రామస్తులు తెలిపారు.సీజనల్ వ్యాధుల నివారణకు ముందస్తు చర్యల్లో భాగంగా వార్డుల్లో, తాగునీటి ట్యాంకులు, మురుగు కాల్వల పరిసరాల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లిస్తున్నారు. మురుగునీరు నిల్వ ఉండకుండా నూతన డ్రైనేజీ బాక్సుల నిర్మాణ పనులను పర్యవేక్షిస్తున్నారు. తాగునీటి ట్యాంకులను క్రమం తప్పకుండా శుభ్రం చేస్తూ క్లోరినేషన్ చేపడుతున్నారు.

ప్రజలకు మెరుగైన సదుపాయాలే ధ్యేయం
ఈ సందర్భంగా సర్పంచ్ గురగాళ్ల బంగారయ్య మాట్లాడుతూ.. గ్రామ ప్రజలు తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా పనిచేస్తానని తెలిపారు. తాగునీరు, సీసీ రహదారులు, డ్రైనేజీ, విద్యుత్, వీధి దీపాలు, పారిశుద్ధ్యం వంటి మౌలిక సదుపాయాలను ప్రతి కాలనీకి అందించేందుకు కృషి చేస్తానని చెప్పారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ సేవలందిస్తానని స్పష్టం చేశారు.







అభివృద్ధి పనులపై గ్రామస్తుల హర్షం
గ్రామంలో అభివృద్ధి పనులు కొనసాగుతుండటంపై గ్రామ పెద్దలు, యువకులు, రైతులు, మహిళలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గ్రామాభివృద్ధికి సర్పంచ్ చేస్తున్న కృషిని అభినందిస్తూ, ఇదే స్ఫూర్తితో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని కోరుతున్నారు.

తెలంగాణాకు కేంద్రం 1,230 కోట్ల ప్రాజెక్టులు..5 కొత్త రోప్‌వేలు!

యాదగిరిగుట్ట సహా ఐదు ప్రాంతాలకు కేంద్రం అనుమతి

అక్టోబర్ 17, సెంట్రల్ డెస్క్:
తెలంగాణలో పర్యాటక, ఆధ్యాత్మిక, చారిత్రక ప్రాంతాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. పర్వతమాల పథకం కింద రాష్ట్రంలో ఐదు ప్రాంతాల్లో కొత్త రోప్‌వేల నిర్మాణానికి అనుమతి లభించింది. ఈ ప్రాజెక్టులకు సుమారు రూ.1,230 కోట్ల అంచనా వ్యయం కేటాయించినట్లు సమాచారం. రోప్‌వేలు అందుబాటులోకి వస్తే భక్తులు, పర్యాటకులకు కొండ ప్రాంతాలకు చేరుకోవడం సులభం కానుంది.న్యూఢిల్లీలో కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీతో రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు సమావేశమైన సందర్భంగా ఈ ప్రాజెక్టులకు ఆమోదం లభించినట్లు కథనంలో పేర్కొన్నారు.ప్రతిపాదిత రోప్‌వేలను యాదగిరిగుట్ట, నాగార్జునకొండ, పెద్దపల్లి జిల్లా పరిధిలోని రామగిరి ఖిల్లా, నల్లగొండలోని హనుమాన్ హిల్, నిజామాబాద్‌లోని ఖిల్లా రామాలయం వద్ద ఏర్పాటు చేయనున్నారు. యాదగిరిగుట్టలో పెద్దగుట్ట నుంచి టెంపుల్ సిటీ వరకు సుమారు రెండు కిలోమీటర్ల మేర రోప్‌వే నిర్మించాలని ప్రతిపాదించారు. దీనివల్ల లక్ష్మీనరసింహస్వామి దర్శనానికి వచ్చే భక్తులకు ప్రయాణ సౌకర్యం మెరుగుపడనుంది.నాగార్జునకొండలోని బౌద్ధ వారసత్వ ప్రాంతానికి పర్యాటకులు సులభంగా చేరుకునేలా రోప్‌వే ఏర్పాటు చేయనున్నారు. రామగిరి ఖిల్లా వద్ద కొండ పాదం నుంచి శిఖరం వరకు సుమారు 2.1 కిలోమీటర్ల మేర, నల్లగొండ హనుమాన్ హిల్‌పైకి 1.2 కిలోమీటర్ల మేర రోప్‌వే నిర్మాణానికి ప్రతిపాదనలు ఉన్నాయి. నిజామాబాద్‌లోని ఖిల్లా రామాలయం వద్ద కూడా ఈ సౌకర్యాన్ని కల్పించనున్నారు.కేంద్రం నుంచి అనుమతులు లభించిన నేపథ్యంలో జాతీయ రహదారుల లాజిస్టిక్స్ నిర్వహణ సంస్థ ఆధ్వర్యంలో సమగ్ర ప్రాజెక్టు నివేదికలు, భూసేకరణ, టెండర్ల ప్రక్రియలు తదుపరి దశల్లో చేపట్టే అవకాశం ఉంది. ఈ ప్రాజెక్టులు పూర్తయితే పర్యాటకుల రాక పెరగడంతో పాటు స్థానికంగా హోటళ్లు, రవాణా, పర్యాటక మార్గదర్శక సేవల రంగాల్లో ఉపాధి అవకాశాలు పెరిగే అవకాశం ఉంది.



తెలంగాణలో విజృంభిస్తున్న 'కల్తీ' మాఫియా..
పెండింగ్ లోనే వేల కేసులు..? పరిష్కార మార్గాలు ఏంటి..?

పాలు, నెయ్యి నుంచి మసాలా దినుసుల వరకు కల్తీ ఆరోపణలు..

కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజల డిమాండ్

అక్టోబర్ 17,సెంట్రల్ డెస్క్:
తెలంగాణలో ఆహార కల్తీ సమస్య ప్రజలను ఆందోళనకు గురిచేస్తోంది. భారత ఆహార భద్రత, ప్రమాణాల ప్రాధికార సంస్థ గణాంకాలుగా పేర్కొన్న వివరాల ప్రకారం, రాష్ట్రంలో పరీక్షించిన 15,702 ఆహార నమూనాల్లో 2,387 నమూనాల్లో కల్తీ ఉన్నట్లు వెల్లడైంది. ఇది సుమారు 15 శాతానికి సమానం. దక్షిణాది రాష్ట్రాల్లో తమిళనాడు తర్వాత తెలంగాణ రెండో స్థానంలో ఉన్నట్లు కథనం పేర్కొంది.పాలు, పనీర్, కోవా, నెయ్యి, వంట నూనెలు, అల్లం, వెల్లుల్లి, మసాలా దినుసులు, తేనె, టీ పొడి వంటి నిత్యావసర పదార్థాల నాణ్యతపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కల్తీ ఆహారం వల్ల జీర్ణ సమస్యలు, విరేచనాలు, అలర్జీలు, ఆహార విషబాధ వంటి ఆరోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. హానికర పదార్థాలతో కూడిన ఆహారాన్ని దీర్ఘకాలం తీసుకోవడం మరిన్ని ఆరోగ్య సమస్యలకు దారితీయవచ్చు.ఆహార కల్తీని అరికట్టేందుకు అధికారులు ఆకస్మిక తనిఖీలు పెంచాలని, హోటళ్లు, రెస్టారెంట్లు, ఆహార తయారీ కేంద్రాల్లో నాణ్యతను నిరంతరం పర్యవేక్షించాలని ప్రజలు కోరుతున్నారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని సూచిస్తున్నారు.
వినియోగదారులు కూడా ఆహార పదార్థాల తయారీ, గడువు తేదీలు, ప్యాకింగ్ వివరాలను పరిశీలించి కొనుగోలు చేయాలని నిపుణులు సూచిస్తున్నారు.

వెంటనే డిలీట్ చేయండి.. లేదంటే చట్టపరమైన చర్యలు తప్పవు: నటి నేహా శర్మ



ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ టెక్నాలజీని ఉపయోగించి తన ఫొటోలు, వీడియోలను అనధికారికంగా వాడుతున్న వారిపై బాలీవుడ్ హీరోయిన్ నేహా శర్మ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తన అనుమతి లేకుండా సృష్టించిన ఏఐ కంటెంట్ తన ప్రతిష్ఠకు భంగం కలిగిస్తోందని, ఇలాంటివి పునరావృతమైతే చట్టపరమైన చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. ఈ మేరకు తన ఎక్స్ ఖాతాలో ఒక ప్రకటన విడుదల చేశారు.“నా ఫొటో లేదా పోలికలతో ఏఐ వీడియోలు, ఇమేజ్‌లు సృష్టిస్తున్న వారు వెంటనే ఆపాలి. ఇప్పటికే పోస్ట్ చేసిన కంటెంట్‌ను తక్షణమే తొలగించండి. నా గుర్తింపును ఉపయోగించి కొత్తగా ఎలాంటి ఏఐ కంటెంట్‌ను తయారుచేయవద్దు, ఎడిట్ చేయవద్దు, సర్క్యులేట్ చేయవద్దు” అని ఆమె స్పష్టం చేశారు.“ఈ విధంగా నా ముఖాన్ని ఉపయోగించి నన్ను తప్పుగా చిత్రీకరించడం లేదా నా ప్రతిష్ఠ దెబ్బతీయడం ఏమాత్రం ఆమోదయోగ్యం కాదు. నా ముఖాన్ని లేదా పోలికలను అనధికారికంగా ఉపయోగించడానికి నేను అంగీకరించను. ఈ పోస్ట్‌ను అధికారిక హెచ్చరికగా పరిగణించండి. ఇలాంటి కంటెంట్‌ను సృష్టించిన, పోస్ట్ చేసిన, సర్క్యులేట్ చేసిన ప్రతి ఒక్కరిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాను. ఫేక్ అకౌంట్లు లేదా ఏఐ టెక్నాలజీ వెనుక దాక్కుంటే శిక్ష నుంచి తప్పించుకోలేరు” అని నేహా తన పోస్ట్‌లో పేర్కొన్నారు. ఇటీవలి కాలంలో సెలబ్రిటీలను లక్ష్యంగా చేసుకుని డీప్‌ఫేక్, మార్ఫింగ్ కంటెంట్ పెరుగుతున్న నేపథ్యంలో నేహా శర్మ హెచ్చరిక ప్రాధాన్యత సంతరించుకుంది.

కోహ్లీ అహంకారిగా కనిపించడానికి కారణం

అసలు విషయం బయటపెట్టిన డివిలియర్స్

టీమిండియా స్టార్ క్రికెటర్ విరాట్ కోహ్లీపై దక్షిణాఫ్రికా మాజీ ఆటగాడు ఏబీ డివిలియర్స్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. తొలిసారి కలిసినప్పుడు కోహ్లీని అహంకారిగా, మితిమీరిన ఆత్మవిశ్వాసం ప్రదర్శించే వ్యక్తిగా భావించానని వెల్లడించాడు. అయితే, అది అతడి వ్యక్తిత్వంలోని మరో కోణమని, తన సామర్థ్యంపై ఉన్న బలమైన నమ్మకమే అలా కనిపించడానికి కారణమని వివరించాడు. కాలక్రమంలో కోహ్లీ వ్యక్తిత్వంలో మార్పు వచ్చిందని తెలిపాడు.ప్రఖర్ గుప్తాతో జరిగిన పాడ్‌కాస్ట్‌లో డివిలియర్స్ ఈ విషయాలను పంచుకున్నాడు. తొలిసారి కలిసినప్పుడు కోహ్లీని నిజంగానే ‘అహంకారి, పొగరుబోతు’గా భావించారా? అని అడగ్గా.. “అవును, కోహ్లీ కూడా ఈ విషయాన్ని అంగీకరిస్తాడు” అని సమాధానమిచ్చాడు. అయితే, తాను ఆ మాటలను సరదాగానే చెబుతుంటానని స్పష్టం చేశాడు.19 నుంచి 21 ఏళ్ల వయసులో కోహ్లీ చాలా ఆత్మవిశ్వాసంతో ఉండేవాడని డివిలియర్స్ పేర్కొన్నాడు. తన సామర్థ్యంపై గట్టి నమ్మకం ఉండటమే అతడిని అలా చూపించిందని చెప్పాడు. కొన్నిసార్లు అలాంటి ఆత్మవిశ్వాసాన్ని ఇతరులు అహంకారంగా పొరబడతారని వివరించాడు. గొప్ప విజయాలు సాధించాలంటే తనపై తనకు నమ్మకం ఉండటం అవసరమని అభిప్రాయపడ్డాడు.విరాట్ కోహ్లీతో డివిలియర్స్‌కు మైదానం బయట కూడా మంచి అనుబంధం





ఉంది. ఐపీఎల్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) తరఫున కలిసి ఆడిన సమయంలో వీరిద్దరి స్నేహం మరింత బలపడింది. అప్పటి నుంచి కోహ్లీ ఆటతీరుతో పాటు అతడి వ్యక్తిత్వాన్ని కూడా డివిలియర్స్ మరింతగా అభిమానిస్తూ వచ్చాడు.కోహ్లీ ఎదుగుతున్న కొద్దీ అతడిలోని ఆ అతివిశ్వాస భావన తగ్గిందని డివిలియర్స్ తెలిపాడు. వయసుతో పాటు వ్యక్తిగా, క్రికెటర్‌గా మరింత పరిణతి సాధించాడని చెప్పాడు. చిన్న వయసులో తనను తాను నిరూపించుకోవాలనే తపన కోహ్లీలో ఎక్కువగా ఉండేదని, విజయాలు సాధించే కొద్దీ ఆ అవసరం తగ్గిందని వివరించాడు. తనపై నమ్మకాన్ని ఇతరుల ముందు అతిగా ప్రదర్శించాల్సిన అవసరం కూడా క్రమంగా తగ్గిపోయిందని పేర్కొన్నాడు.

ముంబై ఇండియన్స్‌కి మహేల జయవర్ధనే గుడ్‌బై!

ఐపీఎల్‌లో ఐదుసార్లు ఛాంపియన్‌గా నిలిచిన ముంబై ఇండియన్స్ కీలక నిర్ణయం తీసుకుంది. ఆ జట్టు హెడ్ కోచ్ మహేల జయవర్ధనేతో తన అనుబంధాన్ని ముగించుకుంది. ఇరుపక్షాలు పరస్పర అంగీకారంతో విడిపోవాలని నిర్ణయించుకున్నాయి. 2026 సీజన్‌లో జట్టు ఆశించిన స్థాయిలో రాణించకపోవడంతో వచ్చే సీజన్‌కు కొత్త కోచ్‌ను నియమించేందుకు ఫ్రాంచైజీ సిద్ధమవుతోంది.2026 ఐపీఎల్ సీజన్ ముంబై ఇండియన్స్‌కు నిరాశనే మిగిల్చింది. ఆ సీజన్‌లో జట్టు కేవలం నాలుగు విజయాలకే పరిమితమైంది. ఆటగాళ్ల గాయాలు, అందుబాటులో లేకపోవడం, డ్రెస్సింగ్ రూమ్‌లో విభేదాలు ఉన్నాయన్న వార్తలు జట్టు ప్రదర్శనపై ప్రభావం చూపినట్లు కథనాలు వెలువడ్డాయి. కొత్త హెడ్ కోచ్ ఎంపిక కోసం ఫ్రాంచైజీ ఇప్పటికే పలువురి పేర్లను పరిశీలిస్తున్నట్లు సమాచారం. వచ్చే వారంలో అభ్యర్థులతో ఇంటర్వ్యూలు నిర్వహించే అవకాశం ఉంది. జయవర్ధనే ముంబై ఇండియన్స్‌లో మరో బాధ్యతలో కొనసాగే అవకాశం లేదని తెలుస్తోంది.ముంబైతో జయవర్ధనే ప్రయాణం 2017లో ప్రారంభమైంది. ఆయన కోచింగ్‌లో జట్టు 2017, 2019, 2020 సీజన్లలో ఐపీఎల్ టైటిళ్లు సాధించింది. ముఖ్యంగా 2019, 2020లో వరుసగా ఛాంపియన్‌గా నిలిచింది. దీంతో ఫ్రాంచైజీ చరిత్రలో అత్యంత విజయవంతమైన కోచ్‌లలో ఒకరిగా జయవర్ధనే గుర్తింపు పొందాడు.2022 నుంచి 2024 వరకు ముంబై ఇండియన్స్ గ్లోబల్ హెడ్ ఆఫ్ పెర్ఫార్మెన్స్‌గా వ్యవహరించిన అతడు.. కోచింగ్, ఆటగాళ్ల ఎంపిక, వ్యూహరచన వంటి బాధ్యతలను పర్యవేక్షించాడు. 2024లో తిరిగి హెడ్ కోచ్‌గా బాధ్యతలు చేపట్టాడు. 2025లో ముంబై ప్లేఆఫ్స్‌కు చేరినా, 2026లో తొమ్మిదో స్థానానికి పడిపోయింది.ముంబైతో తన అనుబంధం పదేళ్లకు పైగా కొనసాగిందని జయవర్ధనే పేర్కొన్నాడు. ఆటగాళ్లు, కోచింగ్ సిబ్బంది, అభిమానులతో కలిసి ఎన్నో మధుర జ్ఞాపకాలు సృష్టించుకున్నామని తెలిపాడు. తనపై నమ్మకం ఉంచిన నీతా అంబానీ, ఆకాశ్ అంబానీలకు కృతజ్ఞతలు చెప్పాడు. ముంబై ఇండియన్స్‌కు ఆయన అందించిన సేవలను నీతా అంబానీ కూడా ప్రశంసించారు. జయవర్ధనే ఎప్పటికీ తమ ‘వన్ ఫ్యామిలీ’లో భాగమేనని పేర్కొన్నారు.కొత్త కోచ్ ఎంపిక దిశగా అడుగులు వేస్తున్న ముంబై ఇండియన్స్.. వచ్చే ఐపీఎల్ సీజన్‌లో మళ్లీ టైటిల్ పోటీలో నిలవడమే లక్ష్యంగా ముందుకు సాగనుంది.



SPORTS

ఆఖరి టీ20లోనైనా ఛాన్స్ వస్తుందా?

వైభవ్ సూర్యవంశీ ఆసక్తికర పోస్టు!



భారత్, వెస్టిండీస్ మధ్య ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్ కీలక దశకు చేరుకుంది. ఇరు జట్లు చెరో రెండు విజయాలతో 2-2తో సమంగా ఉండటంతో ఈరోజు రాత్రి జరిగే ఆఖరి మ్యాచ్ సిరీస్ విజేతను నిర్ణయించనుంది. బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియంలో జరగనున్న ఈ పోరుపై అభిమానుల్లో ఆసక్తి నెలకొంది. ఈ సమయంలో యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ సోషల్ మీడియాలో పెట్టిన పోస్టు చర్చనీయాంశంగా మారింది.15 ఏళ్ల వైభవ్‌కు ఈ సిరీస్‌లో ఇప్పటివరకు ఒక్క మ్యాచ్‌లోనూ ఆడే అవకాశం రాలేదు. నాలుగు మ్యాచ్‌ల్లోనూ బెంచ్‌కే పరిమితమయ్యాడు. తుది జట్టులో ఓపెనర్లుగా సంజూ శాంసన్, అభిషేక్ శర్మకు జట్టు యాజమాన్యం ప్రాధాన్యం ఇస్తుండటంతో వైభవ్‌కు చోటు దక్కలేదు. ఈ నేపథ్యంలో తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో ‘ఇప్పటికీ నమ్మకంతోనే ఉన్నా’ అనే అర్థం వచ్చేలా పోస్టు పెట్టాడు. దీంతో ఆఖరి టీ20లోనైనా అతడికి అవకాశం లభిస్తుందా? అనే చర్చ మొదలైంది.అయితే, వైభవ్ పోస్టు ఆధారంగా అతడిని తుది జట్టులోకి తీసుకుంటారని చెప్పలేం. కీలకమైన సిరీస్ నిర్ణయాత్మక మ్యాచ్‌లో గెలుపే లక్ష్యంగా బరిలోకి దిగనున్న టీమిండియా.. తన ఓపెనింగ్ జోడీని మార్చుతుందా? లేదా? అనేది ఆసక్తికరంగా మారింది.వైభవ్‌ను ఆడించే అంశంపై హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ గతంలోనూ స్పందించాడు. వైభవ్ మంచి ఫామ్‌లో ఉన్నప్పటికీ, తుది జట్టు ఎంపికలో పలు అంశాలను పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుందని తెలిపాడు. ప్రస్తుతం అభిషేక్ శర్మ, సంజూ శాంసన్ జోడీని మార్చాలంటే వారిలో ఒకరిని తప్పించాల్సి వస్తుందని, మంచి ఫలితాలు ఇస్తున్న కాంబినేషన్‌ను అకస్మాత్తుగా మార్చడం అంత సులభం కాదని వివరించాడు.మరి సిరీస్ విజేతను నిర్ణయించే చివరి పోరులో వైభవ్‌కు అవకాశం దక్కుతుందా? లేక మరోసారి బెంచ్‌కే పరిమితం కావాల్సి వస్తుందా? అనేది మ్యాచ్ తుది జట్టు ప్రకటనతో తేలనుంది.